
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3



కృష్ణా జిల్లా వార్తలు

శనివారం 2 నవంబరు 2024



ఆగ్రా దగ్గరలో మురళీకృష్ణ పాదయాత్ర

అవిశ్రాంత యాత్ర

71 ఏళ్ల వయసులో ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి సాహసం

పెన్షన్‌దారుల సమస్యలు తీర్చాలంటూ ఢిల్లీకి పాదయాత్ర

- సెప్టెంబరు 10న విజయవాడ నుంచి మొదలు
- ఈపీఎస్ పెంచాలంటూ ఇండియా గేట్ వద్ద నిరసన
- పీఎఫ్ ఆఫీసుతో పాటు ప్రధాని కార్యాలయంలో వినతి
- ఇంట్లో చెప్పకుండానే వెళ్లొచ్చా.. : మురళీకృష్ణ

ఏడు పదుల వయసులోనూ ఆయన ఏమాత్రం వెనకడుగు వేయలేదు. విశ్రాంత ఉద్యోగి అయినా అవిశ్రాంత పోరులో ముందడుగే వేశారు. ఆర్టీసీలో లక్షలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు పెన్షన్‌దారుల సమస్యలను తీర్చాలంటూ ఒకటి కాదు.. రెండు కాదు.. వేల కిలోమీటర్ల పాదయాత్ర చేశారు. సెప్టెంబరు 10న నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి పాదయాత్ర ప్రారంభించి ఢిల్లీకి చేరారు. ఇండియా గేట్ వద్ద నిరసన తెలియజేశారు. పీఎఫ్ ఆఫీసుతో పాటు ప్రధానమంత్రి, ఆర్థిక మంత్రి కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించి.. ఇటీవల పాదయాత్రను పూర్తిచేసుకుని నగరానికి వచ్చిన లోకాల మురళీకృష్ణ తన అనుభవాలను 'ఆంధ్రజ్యోతి'తో పంచుకున్నారు.

6లో



దేదీప్యం

దీపావళి సంబరాలు ఇంద్రకీలాద్రిపై ఘనంగా జరిగాయి. రంగురంగుల బాణసంచా వెలుగుల నడుమ రాజగోపురం మరింత శోభాయమానంగా ప్రకాశించింది.

పండుగలో విషాదం



జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డు వద్ద ప్రమాదంలో నుజ్జయిన ట్రక్ ఆటో

రెండు జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాలు.. ఆరుగురు దుర్మరణం

- జి.కొండూరు-చెవుటూరు బైపాస్ వద్ద ఘోరం
- 13 మంది కూలీలతో వెళ్తున్న ట్రక్ ఆటోను ఢీకొన్న లారీ

- ముగ్గురు మృతి.. పదిమందికి గాయాలు
- కొండాయపాలెం వద్ద కాల్వలోకి దూసుకెళ్లిన కారు
- ఊపిరాడక ఇద్దరు జలసమాధి
- కురుమద్దాలి వద్ద కారు అదుపుతప్పి వ్యక్తి మృతి

పండుగ పూట జిల్లాలో విషాదఛాయలు అలముకున్నాయి. రెండు జిల్లాల్లో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మొత్తం ఆరుగురు మృతిచెందారు. జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారుజామున 3.30 గంటలకు జరిగిన ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం పాలయ్యారు. పనుల కోసం నెల్లూరు జిల్లాకు వెళ్లిన 13 మంది.. కుటుంబంతో కలిసి దీపావళి జరుపుకోవాలని ట్రక్ ఆటోలో ఏ.కొండూరు మండలం రామచంద్రాపురానికి వస్తుండగా జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ఘటనలో కొనకళ్ల నాగరాజు (20), బొలగాని వెంకటేశ్వరరావు (28), ఉయ్యాల సాయికుమార్ (26) మరణించారు. పదిమందికి తీవ్ర గాయాలు కాగా, ఒకరి పరిస్థితి ఇంకా విషమంగా ఉంది. పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై కొండాయపాలెం వద్ద జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు మృతిచెందారు. గుడివాడవైపు నుంచి దావులూరుకు వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న పంటకాల్వలోకి దూసుకెళ్లింది. అక్కడే ఉన్న కూలీలు కారు అద్దాలు పగలగొట్టేసరికే గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడికి చెందిన చలసాని శివరామకృష్ణ (48), కంకిపాడు మండలం దావులూరు గ్రామానికి చెందిన తుమ్మల వేణుగోపాలకృష్ణ (41) ఊపిరి అందక చనిపోయారు. అలాగే, డీఎస్సీ కోచింగ్ తీసుకుంటున్న భార్యను దీపావళికి ఇంటికి తీసుకొద్దామని గన్నవరం మండలం వీరపనేనిగూడేనికి చెందిన సింహాద్రి ప్రసాద్ (40) తన కారులో బయల్దేరగా, కురుమద్దాలి ఫ్లై ఓవర్ వద్దకు రాగానే కారు పంక్చరైంది. అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ప్రసాద్ అక్కడికక్కడే చనిపోయారు.

4

దీపం వెలుగులు

ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభం

కృష్ణాలో 4 లక్షలు, ఎన్టీఆర్‌లో 4,96,000 మంది లబ్దిదారులు

ప్రతి మూడు నెలలకోసారి ఉచిత సిలిండర్



మచిలీపట్నంలో దీపం పథకాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ తదితరులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/మచిలీపట్నం) : ఉచిత గ్యాస్ సిలిండర్ల కోసం ఎన్టీఆర్ జిల్లాలో 4,96,000 మంది, కృష్ణాజిల్లాలో 4,00,000 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. ప్రస్తుతం రూ.15 సబ్సిడీ ఎవరికి అందుతుందో వారిని అర్హులుగా పేర్కొంటున్నారు. దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న వారంతా ఈ పథకానికి ఎంపికయ్యారు. కాగా, ప్రభుత్వం ఇప్పటికే ఆయిల్ కంపెనీలకు డబ్బు జమ చేసింది. ఆయిల్ కంపెనీలు సబ్సిడీని ఏ విధంగా డీబీటీ విధానంలో అందిస్తున్నాయో.. అలాగే, ఉచిత గ్యాస్ సిలిండర్ల డబ్బును కూడా జమ చేస్తారు. ప్రస్తుతం బుక్ చేసుకున్న వారి సంఖ్య తక్కువగానే ఉన్నా.. రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశముంది. అర్హత సాధించిన వారందరికీ ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ప్రతి మూడు నెలలకోసారి సిలిండర్ బుక్ చేసుకోగానే, ఆటోమేటిక్‌గా గ్యాస్ ధర నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుంది. ఇందుకోసం ప్రత్యేకంగా గ్యాస్ కంపెనీల వద్దకు ఆధార్ తీసుకెళ్లడం, ఈకేవైసీ చేసుకోవడం వంటివి అవసరం లేదు. అర్హులైన ప్రతి ఒక్క లబ్ధిదారుడూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి ఎంపికైనట్లు వారి మొబైల్ ఫోన్లకు మెసేజ్‌లు వచ్చాయి. వీటిప్రకారం నిర్దేశించిన మూడు నెలల్లో ఎప్పుడు బుక్ చేసుకున్నా డబ్బు అకౌంట్‌లో జమ అవుతుంది. ప్రతి మూడు నెలలకోసారి ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చు.

కోడెదూడకు కృత్రిమ కాలు

- మానవత్వం చాటుకున్న యజమాని
- పాలకొల్లులో 30 గంటల్లోనే కాలు తయారు



మోపిదేవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : తన ఇంట మూడు కాళ్లతో పుట్టిన కోడె దూడ బాధను చూడలేకపోయాడు ఆ యజమాని. ఎలాగైనా దానిని ఇతర దూడలతో సమానంగా నడిపించాలని కంకణం కట్టుకున్నాడు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన వేదాంతం సదాశివమూర్తి మనుషులకే కాదు మూగజీవాలకు కూడా కృత్రిమ అవయవాలు అమర్చి మానవత్వం చాటుకుంటున్నారని తెలిసి.. అక్కడ తన దూడకు కృత్రిమ కాలు తయారు చేయించాడు ఆ యజమాని. వివరాల్లోకి వెళితే.. స్వతహాగా గోపాలమిత్ర అయిన మోపిదేవి మండలంలోని కె.కొత్తపాలేనికి చెందిన మత్తి శ్రీనివాసరావు ఇంట్లో ఆరు నెలల క్రితం కపిల ఆవుకు మూడు కాళ్లతో కోడె దూడ జన్మించింది. నడవడానికి అది పడుతున్న బాధను చూడలేకపోతున్న శ్రీనివాసరావు.. పది రోజుల క్రితం మోపిదేవి పశువైద్యాధికారి నందకిశోర్‌ను సంప్రదించాడు. దాంతో ఆయన తన స్నేహితుడు, పశ్చిమ గోదావరి జిల్లాలో పనిచేస్తున్న మరో పశువైద్యాధికారిని సంప్రదించగా.. ఆయన వేదాంతం సదాశివమూర్తి నిర్వహిస్తున్న చైతన్య కృత్రిమ అవయవ కేంద్రం గురించి చెప్పారు. అక్కడ మనుషులకే కాకుండా పశువులకు కూడా కృత్రిమ అవయవాలు తయారు చేసి ఇస్తారని వివరించారు. దీంతో శ్రీనివాసరావు దూడను ఆటోలో పాలకొల్లుకు తీసుకెళ్లగా, దానిని పరిశీలించిన సదాశివమూర్తి 30 గంటల్లోనే దూడకు సరిపోయే కృత్రిమ కాలును తయారుచేసి అమర్చారు. ప్రస్తుతం దూడ నడుస్తూ చలాకీగా ఉండటంతో యజమాని సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.

మోత మోగింది..!

గత ఏడాది కంటే ఘనంగా దీపావళి

- భారీగా పెరిగిన ధ్వని, గాలి కాలుష్యం
- ధూళికణాల స్థాయి పెంపుతో శ్వాసకోశ సమస్యలు
- 115 మైక్రాన్లకు పెరిగిన పీఎం 10
- ప్రమాదకరమంటున్న పర్యావరణవేత్తలు



దీపావళి పండుగంటే.. టపాసుల వేడుక అనుకుంటాం.. వేలకు వేలు ఖర్చుచేసి కొనేస్తాం.. ఫుల్ టూ బిందాస్‌గా మోత మోగించేస్తాం.. కానీ, సరదాకు మనం చేసే ఈ శబ్దాల వెనుక అంతులేని అనారోగ్యం దాగి ఉంటుందని ఆలోచించం. మనం కాల్చగా వదిలేసిన దుమ్ము ధూళి కణాలు ప్రాణకారకాలని గుర్తించం. ఇలాంటి ప్రమాదాల నుంచి బయటపడటానికి పర్యావరణహిత వేడుకలు జరుపుకోవాలని, కాలుష్యరహితంగా సంబరాలు చేసుకోవాలని పర్యావరణవేత్తలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారులు హెచ్చరిస్తున్నా ఈ దీపావళి కూడా గత ఏడాది కంటే ఘనంగానే మోత మోగింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ఒక్కరోజులో ధ్వని, గాలి కాలుష్యం ప్రమాద ఘంటికలను మోగించాయి. సత్యనారాయణపురంలో అత్యధికంగా ధ్వనికాలుష్యం నమోదైంది. ఇక్కడ 102 డెసిబుల్స్ శబ్దం రికార్డైంది. అలాగే, నగరం మొత్తంమీద పీఎం 10 ధూళికణాల స్థాయి 115 మైక్రాన్లకు, పీఎం 2.5 ధూళికణాల స్థాయి 49 మైక్రాన్లుగా నమోదైంది. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు రెండు విధాలుగా ధ్వని, గాలికాలుష్య లెక్కలను నమోదు చేస్తారు. ఈ నిబంధనల ప్రకారం ధ్వనికాలుష్యం పగటిపూట 65, రాత్రిపూట 55 డెసిబుల్స్ ఉండాలి. సత్యనారాయణపురం వీఎంసీ సర్కిల్-2 కార్యాలయ ప్రాంతంలో పగటిపూట 79, రాత్రిపూట 102 డెసిబుల్స్ నమోదైంది. గత ఏడాది ఇక్కడ 65 డెసిబుల్స్ రికార్డైంది. ఒక్క ఏడాదిలో 37 డెసిబుల్స్ పెరిగిందన్నమాట. ఇక ఆలిండియా రేడియో స్టేషన్ వద్ద శబ్ద కాలుష్యం గత ఏడాది కంటే ఈసారి ఒక డెసిబుల్ పెరిగింది. ఇక్కడ పగటిపూట 62, రాత్రిపూట 65 డెసిబుల్స్‌గా నమోదైంది. గత ఏడాది దీపావళికి ఇక్కడ 64 డెసిబుల్స్ రికార్డైంది. అలాగే, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ హాల్ వద్ద 10 డెసిబుల్స్ కాలుష్యం పెరిగింది. గత ఏడాది ఇక్కడ 64 డెసిబుల్స్ నమోదు కాగా, తాజాగా 77 డెసిబుల్స్‌గా రికార్డైంది. ఇక్కడ పగటి పూట 72 డెసిబుల్స్ నమోదైంది. ఆంధ్రా లయోలా కళాశాల వద్ద మధ్యాహ్నం 12 గంటలకు 66 డెసిబుల్స్ ఉన్న శబ్ద కాలుష్యం రాత్రికి 72 డెసిబుల్స్‌కు చేరింది. గత ఏడాది ఇక్కడ 54 డెసిబుల్స్ ఉంది. జిల్లా పరిశ్రమల కేంద్రం వద్ద పగటిపూట 67, రాత్రిపూట 74 డెసిబుల్స్ రికార్డైంది. గత ఏడాది ఇక్కడ 61 డెసిబుల్స్ ఉంది.

పెరుగుతున్న గాలి కాలుష్యం

నగరంలో గాలి కాలుష్యం పెరుగుతోంది. గాల్లో మైక్రోటోన్, ఓజోన్, సల్ఫర్ డయాక్సైడ్, నైట్రోజన్ డయాక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, బెంజిన్, లెడ్ వంటి 12 రకాల కణాలు ఉంటాయి. నగరంలో ఇవన్నీ సాధారణ స్థాయిని దాటిపోతున్నాయని తేలింది. గాల్లో పీఎం 10 విలువ 100 మైక్రాన్లలోపు ఉండాలి. అది ఇప్పుడు 115 మైక్రాన్లకు పెరిగింది. అదే పీఎం 2.5 విలువ గాల్లో 60 మైక్రాన్లలోపు మిగతా 4లో..

రెవెన్యూ స్థలాన్వేషణ

- కొత్తూరు తాడేపల్లిలో 100 ఎకరాల పరిశీలన
- టిడ్కో ఇళ్ల కోసమా? ఎంఐజీ లే అవుట్ల కోసమా?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జిల్లాలో గృహ నిర్మాణాల కోసం రెవెన్యూ యంత్రాంగం స్థలాన్వేషణ చేపట్టినట్టు తెలుస్తోంది. విజయవాడ రూరల్ మండలం కొత్తూరు తాడేపల్లిలో 100 ఎకరాల భూముల కోసం విజయవాడ ఆర్డీవో చైతన్య భూములు పరిశీలించడమే ఇందుకు కారణం. అయితే, ఈ భూములు దేనికోసమన్నది ఉన్నతాధికారులు స్పష్టత ఇవ్వలేదు. టిడ్కో ఇళ్లు నిర్మించుకోవడం కోసమా? సీఆర్‌డీఏ పరిధిలో ఎంఐజీ లే అవుట్ల కోసం తీసుకోవాలనుకుంటున్నారా? అనే విషయం తెలియరాలేదు. కాగా, వారం కిందటే కొత్తూరు తాడేపల్లిలోని పోలవరం కాల్వకు దిగువన గద్దె కాల్వ, పంప్‌హౌస్, కిచ్చాయిగుంట నుంచి కవులూరు రోడ్డు వరకు భూములను రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ విషయం తెలిసి దాదాపు 40 మందికిపైగా తమ భూములు ఇవ్వటానికి ఆసక్తి తెలిపారు. ఈ నేపథ్యంలో టీడీపీ ఎస్సీసెల్ నాయకులు మెండం జమలయ్య, టీడీపీ రైతుసంఘం నాయకులు చింతా సుధాకర్, స్థానిక రైతులు పోతరాజు వెంకటేశ్వరరావు, ఉప్పలపాటి వెంకట్రావు శుక్రవారం రూరల్ తహసీల్దార్ సుగుణను కలిశారు. గృహ నిర్మాణాల కోసం అక్కడి భూములు సరికావని వారంతా హితవు పలికారు. వర్షమొస్తే ఆ భూములు మునిగిపోతాయని చెప్పారు. పోలవరం ఎగువన మెట్ట భూములు ఉన్నాయని, మెరక తోలాల్సిన అవసరం లేదని, రైతులు కూడా భూములు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నారని చెప్పారు. స్పందించిన తహసీల్దార్ సుగుణ.. విషయాన్ని ఆర్డీవో దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన రైతులు సూచించిన భూములను పరిశీలించాలని నిర్ణయించారు. రాత్రి సమయమైనా.. పోలవరం కాల్వ ఎగువన ఉన్న భూములను పరిశీలించారు.

దివి జీవనాడికి మంచిరోజులు

- అక్విడెక్ట్ రక్షణపై శ్రద్ధచూపని వైసీపీ
- కూటమి ప్రభుత్వం నిధుల విడుదల

4లో



షోకాజ్ నోటీసులు ఇస్తున్న కమిషనర్ బాపిరాజు

72 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పింఛన్ల పంపిణీలో అలసత్వం వహించిన సచివాలయ కార్యదర్శులు72 మందికి మునిసిపల్ కమిషనర్ కె.బాపిరాజు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఉదయం 5.30 నుంచే నగరంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఇందుకుగాను 394 మందిని నియమించారు. అయితే 72 మంది సకాలంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరుకాలేదు. 6.30 గంటల వరకు 72 మంది పింఛన్లు పంపిణీ చేయకపోవడంతో వారికి కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీచేశారు. శుక్రవారం నూరుశాతం పింఛన్ల పంపిణీ లక్ష్యం నెరవేరాల్సి ఉందని, అయితే క్షేత్రస్థాయిలో 5.30 గంటలకు హాజరుకాని సచివాలయ కార్యదర్శులకు కమిషనర్ షోకాజ్ నోటీసులు జారీచేయడంతో నగరంలో సంచలనం రేకెత్తించింది. శుక్రవారం హెల్త్ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయడంతో పాటు మరో హెల్త్ ఇన్‌స్పెక్టర్‌కు షోకాజ్ నోటీసు జారీ చేయడం, 72 మంది సచివాలయ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయడంతో కార్యాలయ ఉద్యోగులు ఎవరి సీట్లలో వారు కూర్చుని పనులు చేసే పరిస్థితి ఏర్పడింది.

6, 8 తేదీల్లో పదోన్నతుల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం, గుడివాడ మునిసిపల్ టీచర్లకు ఈనెల 6, 8 తేదీల్లో పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇందుకుగాను డీఈవో కార్యాలయంలో షెడ్యూల్ ప్రకటించారు. 6న ప్రధానోపాధ్యాయులు, ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. 8న స్కూల్ అసిస్టెంట్ల పదోన్నతుల కౌన్సెలింగ్ జరుగుతుంది. అయితే ఎక్కువ స్కూల్ అసిస్టెంట్ పోస్టులు డీఎస్సీలో పొందుపరచడంతో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు యూవీ కృష్ణమూర్తి, టి.అంజయ్య, ప్రసాద్, ఎస్.కిరణ్‌బాబు, వీరబాబులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మేరకు డీఈవో రామారావును కలిసి వినతిపత్రం సమర్పించారు.



అవనిగండ్లపాడు మునేటి ఇసుకరేవు నుంచి అక్రమంగా బయటకు వెళుతున్న ఇసుక లారీలను అడ్డుకుంటున్న టీడీపీ నేతలు

అనిగండ్లపాడులో ఇసుక అక్రమ రవాణా!

» టిప్పర్లను అడ్డుకున్న రైతులు, టీడీపీ నేతలు

పెనుగంచిప్రోలు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మునేటి రేవు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారంటూ అనిగండ్లపాడు గ్రామానికి చెందిన టీడీపీ నేత తిరుపతమ్మ దేవస్థానం మాజీ చైర్మన్ అత్తలూరి అచ్యుతరావు ఆధ్వర్యంలో రైతులు, నేతలు టిప్పర్లను అడ్డుకున్నారు. సేకరించిన సమాచారం మేరకు.. విజయవాడకు చెందిన కొంత మంది గన్నవరం విమానాశ్రయం అభివృద్ధి పనులకు ప్రభుత్వ అనుమతితో అనిగండ్లపాడు మునేటి రేవు నుంచి ఇసుకను టిప్పర్లలో వస్తుండగా, రైతులు, టీడీపీ నేతలు అక్కడికి చేరుకుని ట్రాక్టర్లను అడ్డు పెట్టి టిప్పర్లను బయటకు వెళ్లకుండా అడ్డుకున్నారు. అనిగండ్లపాడు శివాపురం గ్రామాల రక్షిత మంచినీటి సరఫరా పథకాలు ఉన్నాయని, ఇక్కడ ఇసుక యంత్రాలతో తోడితే పథకాలకు ఇబ్బంది కలగటంతో పాటు మునేటికి భారీగా వరదలు వచ్చినప్పుడు సమీపంలోని తమ పొలాలు ముంపునకు గురై లక్షల రూపాయలు అదనంగా ఖర్చు పెట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాలతో ఇసుక తోడకుండా కూలీలతో ట్రాక్టర్లు టిప్పర్లలో పోసుకుంటే తమకు ఇబ్బంది లేదని, అవకాశం ఉంటే ఇక్కడ రీచ్‌ను వేరే ప్రాంతానికి తరలించాలని నేతలు, రైతులు అధికారులను కోరుతున్నారు. దీంతో ఎస్ఐ ఎంఎస్.కె.అర్జున అక్కడకు చేరుకొని రైతులు, నేతలతో మాట్లాడి శాంతింపజేశారు. తహసీల్దార్ శాంతి లక్ష్మీ ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు మూడు టిప్పర్లు ఎస్కవేటర్‌ను పోలీసులకు అప్పగించారు. ఇసుక టిప్పర్లకు ప్రభుత్వ అనుమతి ఉన్నందున పోలీసులు వదిలివేశారు. రీచ్ నుంచి అక్రమంగా ఇసుక రవాణా జరుగకుండా ఎస్ఐ అర్జున, రెవెన్యూ అధికారుల సమక్షంలో పెద్ద గొయ్యి తవ్వించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పొందూరి శేఖర్, తొట్టెంపూడి మురళి తదితరులు పాల్గొన్నారు.

13న అరుణాచలానికి బస్సు యాత్ర

» శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్‌ల దర్శనం

విజయవాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అరుణాచల క్షేత్రానికి టూర్ ప్యాకేజీ పూర్తి షెడ్యూల్‌ను శుక్రవారం ఆర్టీసీ ఆర్ఎం ఎంవై దానం విడుదల చేశారు. నవంబరు 13 రాత్రి 9 గంటలకు పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి బస్సు బయలుదేరుతుంది. 14 ఉదయం శ్రీకాళహస్తి, మధ్యాహ్నం కాణిపాకం స్వామిని దర్శనం చేసుకుని సాయంత్రం గోల్డెన్ టెంపుల్‌ను సందర్శిస్తారు. రాత్రికి అరుణాచలం చేరుకుంటారు. అరుణాచల గిరి ప్రదక్షిణ అనంతరం దర్శనం పూర్తికాగానే 15 సాయంత్రం తిరిగి బస్సు బయలుదేరుతుంది. 16వ తేదీ ఉదయం 5 గంటలకు విజయవాడ చేరుకుంటారు. యాత్రకు రాను, పోను కలిపి ఒకరికి రూ.2500 ధర నిర్ణయించినట్టు ఆర్ఎం తెలిపారు. బయట ఖర్చులు ఎవరికి వారే పెట్టుకోవాల్సి ఉంటుందని చెప్పారు. సర్వీసు నెంబర్ 95266 గల బస్సులో ఆన్‌లైన్ రిజర్వేషన్ విధానంలో బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. వివరాల కోసం 9959225446, 8074298487, 7382898942లో సంప్రదించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

పండుగకు ముందే..
తెల్లారిన బతుకులు!

ఆరుగురు దుర్మరణం



బొలగాని వెంకటేశ్వర్లరావు, ఉయ్యాల సాయికుమార్, కొనకళ్ల నాగరాజు (ఫైల్ ఫొటోలు)

వారంతా రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబాలకు చెందిన వారు. ఉన్న ఊరు విడిచి పొట్ట చేత పట్టుకొని కూలి పనుల నిమిత్తం ఇతర జిల్లాకు వెళ్లి 20 రోజులుగా పనులు చేసుకొని దీపావళి పండుగను కుటుంబసభ్యులతో కలిసి చేసుకునేందుకు ఎంతో సంతోషంగా ఇంటి ముఖం పట్టారు. అర్ధగంటలో ఎవరి ఇళ్లకు వారు వెళతారనగా.. అంతలోనే మృత్యువు ముగ్గురిని కబళించింది. మరో పదిమంది తీవ్రగాయాలతో ఆస్పత్రిపాలయ్యారు. ఈ విషాదఘటన ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండలంలో జి.కొండూరు - చెవుటూరు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది.

జి.కొండూరు - చెవుటూరు బైపాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం

» లారీని ఢీకొన్న ట్రక్ ఆటో

» ముగ్గురు మృతి.. 10 మందికి గాయాలు

జి.కొండూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జి.కొండూరు-చెవుటూరు బైపాస్ రోడ్డులో గురువారం తెల్లవారుజాము 3.30 గంటలకు ట్రక్ ఆటో ఎదురుగా వస్తున్న లారీని ఢీ కొట్టిన ప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా మరో 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసుల కథనం ప్రకారం.. ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన కూలీలు బొలగాని వెంకటేశ్వరరావు (మేస్త్రి) ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా పొదలిపురం గ్రామానికి బొప్పాయి కోత నిమిత్తం ఈనెల 11న వెళ్లారు. అక్కడే ఉంటూ కూలి పనులు చేసుకుంటున్నారు. అక్టోబరు 31న దీపావళి పండుగను కుటుంబసభ్యులతో కలిసి జరుపుకునేందుకు 30 రాత్రి అశోక్ లేలాండ్ ట్రక్ ఆటోలో మొత్తం 13 మంది బయలుదేరారు. వీరి వాహనం జి.కొండూరు - చెవుటూరు బైపాస్‌లో చెవుటూరు గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని వేగంగా ఢీ కొట్టింది. దీంతో ట్రక్ ఆటో క్యాబిన్‌పై నిద్రిస్తున్న కొనకళ్ల నాగరాజు (20) రోడ్డుపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మేస్త్రి బొలగాని వెంకటేశ్వరరావు (28), డ్రైవింగ్ చేస్తున్న ఉయ్యాల సాయికుమార్ (26)లు విజయవాడలోని వేర్వేరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతూ మృతి చెందారు. మరో పదిమందికి గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన పుల్లారావు పరిస్థితి విషమంగా ఉన్నట్టు పోలీసులు తెలిపారు. బొలగాని వెంకటేశ్వరావుకు, ఉయ్యాల సాయికుమార్‌లకు వివాహాలు అయ్యాయి.

మృత్యువు నుంచి తప్పించుకోలేక..

పుల్లూరు గ్రామానికి చెందిన నాగరాజు పొదలిపురం నుంచి వేరే వాహనంలో వచ్చి ఒంగోలు వద్ద ముఠా ప్రయాణించే వాహనంలో ఎక్కాడు. ఇతర వాహనంలో పుల్లూరు వచ్చినా ప్రమాదం నుంచి తప్పించుకునే వాడేమో అని మృతుని బంధువులు మైలవరం ప్రభుత్వాసుపత్రిలో లబోదిబోమంటున్నారు. నాగరాజు మృతితో కుటుంబం దిక్కులేనిదయ్యింది. నాగరాజు తండ్రికి గతంలో ప్రమాదంలో కాలు తీసేశారు. చెల్లి, తమ్ముడు చదువుకు కూడా అతడే ఆధారం. నాగరాజు మృతితో కుటుంబసభ్యులు దిక్కులేని వారయ్యారు. పోలీసులు మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం

దీపావళి పండుగ వేళ వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ముగ్గురు దుర్మరణం చెందగా ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది. పామర్రు-విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై కురుమద్దాలి ఫ్లైఓవర్ వంతెన సమీపంలో జరిగిన ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై కొండాయపాలెం వద్ద పంట కాల్వలోకి కారుదూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు మృత్యువాత పడ్డారు.

పామర్రు, నవంబరు 1: (ఆంధ్రజ్యోతి) : గన్నవరం మండలం వీరపనేనిగూడెంకు చెందిన సింహాద్రి ప్రసాద్(40)కు భార్య, ఇద్దరు పిల్లలు. కుటుంబసమేతంగా దీపావళి పండుగను అందరూ కలిసి ఘనంగా నిర్వహించుకునేందుకు మెగా డీఎస్సీ కోసం



పంటకాల్వలోకి దూసుకువెళ్లిన కారు, మృతులు చలసాని శివరామకృష్ణ, తుమ్మల వేణుగోపాల కృష్ణ



శిక్షణ తీసుకుంటున్న భార్యను ఇంటికి తీసుకువెళ్లడానికి గురువారం కారులో బయలుదేరాడు. పామర్రు మండల పరిధిలోని కురుమద్దాలి ఫ్లై ఓవర్ సమీపిస్తుండగా టైరు పేలడంతో కారు అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టి అక్కడిక్కడే దుర్మరణం చెందాడు. దీపావళి వారి కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

● గుడ్లవల్లేరు మండలం శేరికల్వపూడికి చెందిన చలసాని శివరామకృష్ణ (48), కంకిపాడు మండలం దావులూరు గ్రామానికి చెందిన తుమ్మల వేణుగోపాల కృష్ణ(41) కలిసి కారులో గురువారం గుడివాడలో బంధువులను కలిసేందుకు వచ్చారు. తిరిగి వెళుతుండగా వారు ప్రయాణిస్తున్న కారు పామర్రు-కత్తిపూడి జాతీయ రహదారిపై కొండాయపాలెం వద్ద అదుపు తప్పి రోడ్డు పక్కన పంటకాల్వలోకి దూసుకెళ్లింది. సమీపంలో పొలం పనులు చేసుకుంటున్న కూలీలు కారు అద్దాలు పగలగొట్టి ఇద్దరినీ బయటకు తీసుకువచ్చినా ఫలితం లేకపోయింది. ఇద్దరూ ఊపిరి అందక మృతిచెందారు. గతంలో అమెరికాలో ఉన్న శివరామకృష్ణ ప్రస్తుతం భార్య, ఇరువురు పిల్లలతో పొరుగు ప్రాంతంలో నివాసముంటున్నాట్టు బంధువులు తెలిపారు. ఎస్సై సీహెచ్ అవినాశ్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల జీవితాల్లో దీపం వెలుగులు

» ఉచిత గ్యాస్ సిలిండర్లను అందజేసిన మంత్రి రవీంద్ర

» కృష్ణా జిల్లాలో 4 లక్షల మంది అర్హులు

మచిలీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం పేదప్రజలకు అండగా ఉంటుందని రాష్ట్రగనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. దీపం-2 ఉచితగ్యాస్ సిలిండర్‌ల పంపిణీ జిల్లాస్థాయి కార్యక్రమం మచిలీపట్నం కార్పొరేషన్‌లోని 27వ డివిజన్‌లో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, 1999లో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు దీపం పథకాన్ని ప్రవేశపెట్టి, పేదలందరికీ సబ్సిడీపై కనెక్షన్లు ఇవ్వడం జరిగిందన్నారు. కట్టెలపొయ్యితో మహిళలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని, సబ్సిడీపై గ్యాస్‌కనెక్షన్లను చంద్రబాబు అప్పట్లో ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇటీవల ఎన్నికలసమయంలో మూడు ఉచిత గ్యాస్‌సిలిండర్‌ల హామీని నెరవేరుస్తున్నట్టు తెలిపారు. జిల్లావ్యాప్తంగా 4లక్షలమందికి ఏడాదికి మూడుచొప్పున ఉచిత గ్యాస్‌సిలిండర్‌లు ఇవ్వనున్నట్టు తెలిపారు. డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదలచేసి 16,700 టీచర్‌పోస్టులను త్వరలో భర్తీచేసేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈనెల 9న ఎంఎస్ఎంఈ పథకం ద్వారా నిరుద్యోగ యువతకు జిల్లాపరిషత్ కన్వెన్షన్ హాలులో ఉపాధిపథకాలకు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ మాట్లాడుతూ, దీపం పథకాన్ని లబ్ధిదారులు సక్రమంగా వినియోగించుకోవాలని కోరారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ప్రభుత్వం ఏడాదికి మూడు సిలిండర్‌లను ఉచితంగా అందించడం పేదకుటుంబాలపై కొంతమేర ఆర్థికభారం తగ్గుతుందన్నారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండిరామకృష్ణ మాట్లాడుతూ, పేదకుటుంబాలకు దీపం-2 పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. డీఎస్‌వో వి.పార్వతి మాట్లాడుతూ, నియోకవర్గంలో 49,800 మంది ఉచితగ్యాస్ సిలిండర్‌ల లబ్ధిదారులను గుర్తించినట్టు తెలిపారు. మోటమర్రి బాబాప్రసాద్, టీడీపీ నాయకులు ఇలియాస్‌బాషా, సయ్యద్‌ఖాజా, గోపు సత్యనారాయణ, తలారి సోమశేఖర్, అజీమ్, ఆర్డీవో కె.స్వాతి తదితరులు పాల్గొన్నారు. అనంతరం 27వ డివిజన్‌కు చెందిన మహ్మద్‌సుల్తానా ఇంటికి వెళ్లి ఉచిత గ్యాస్ సిలిండర్‌ను అందించి స్టౌవ్‌ను మంత్రి కొల్లు రవీంద్ర వెలిగించారు.



ఉచిత గ్యాస్ కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

అత్యంత పారదర్శకంగా దీపం -2 అమలు

» ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా జిల్లాలో అత్యంత పారదర్శకంగా దీపం పథకం-2 అమలుకు చర్యలు తీసుకున్నామని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా, తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. దీపావళి కానుకగా దీపం-2 ఉచిత గ్యాస్ సిలిండర్‌ల పథకాన్ని పటమట 11వ డివిజన్ లలితా గ్యాస్ ఏజెన్సీ వద్ద శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో జెండా ఊపి సిలిండర్‌ల డెలివరీ వ్యాన్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా మాట్లాడుతూ, జిల్లాలో ప్రస్తుతం 4.96లక్షల మంది వినియోగదారులు ఉన్నారని చెప్పారు. వీరంతా ఉచిత పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎప్రిల్-జూలై, ఆగస్టు-నవంబర్, డిసెంబర్-మార్చి కాలానికి ఒక్కో సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు ఇస్తారని చెప్పారు. ఏవైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నెంబరు 1967కు ఫోన్ చేయాలన్నారు.

కూటమి ప్రభుత్వ హయాంలో పేదల జీవితాల్లో వెలుగులు వచ్చాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ చెప్పారు. సూపర్-6లో భాగంగా దీపం-2 పథకంలో గ్యాస్ బుక్ చేయడం తరువాత రోజే గ్యాస్ డెలివరీ ఇవ్వడం, ఆ రెండో రోజే సిలిండర్ డబ్బులు లబ్దిదారుల ఖాతాల్లో వేయడం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఈ పథకానికి 2,684 కోట్ల రూపాయలను వెచ్చించిందన్నారు. పథకం అమలు తీరును ఆర్డీవో చైతన్య వివరించారు. అనంతరం డీఆర్డీఏ అధికారులతో కలిసి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి ఎ.పాపారావు, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, కార్పొరేటర్‌లు ముమ్మనేని ప్రసాద్, సీహెచ్ ఉషారాణి, గ్యాస్ ఏజన్సీ, హెచ్‌పి కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.



ఉచిత గ్యాస్ సిలెండర్‌ల డెలివరీ వ్యాన్‌ను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

చల్లపల్లి సుందరీకరణకు సీఎస్ఆర్ నిధులు

» కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లి సుందరీకరణకు సీఎస్ఆర్ నిధులను కేటాయించనున్నట్టు కలెక్టర్ బాలాజీ తెలిపారు. సీఎస్ఆర్ నిధుల వినియోగంపై శుక్రవారం కలెక్టర్ చాంబరులో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చల్లపల్లి డంపింగ్‌యార్డులో చెత్తనిల్వపై ఆరాతీశారు. చెత్త సేకరణ, డ్రెయిన్‌లు, పారిశుద్ధ్య నిర్వహణకోసం ప్రత్యేకంగా నిధులను కేటాయిస్తామని తెలిపారు. ఆకుమర్రు మంచినీటి పథకానికి సంబంధించి ఫిల్టర్‌బెడ్‌లు, మైక్రో ఫిల్టర్‌బెడ్‌లు ఏర్పాటు చేసేందుకు జిల్లా ఖనిజ నిధులతోపాటు, ఎంపీ ల్యాడ్స్‌ను సమకూరుస్తామని, ఇందుకు అవసరమైన ప్రతిపాదనలను తయారుచేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నటరాజ్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ సుధాకర్, సీపీవో గణేష్ కృష్ణ, చల్లపల్లి ఎంపీడీవో ఆర్‌వీ రమణ, ఈవో మాధవేంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శగ్రామాలను గుర్తించండి

జిల్లాలో ఆదర్శ సౌరగ్రామాల ఏర్పాటుకు అర్హత ఉన్న గ్రామాలను గుర్తించాలని అధికారులను కలెక్టర్ బాలాజీ ఆదేశించారు. సౌరశక్తిని ప్రోత్సాహించేందుకు 5 వేలకు పైబడి జనాభా ఉన్న ఐదు రెవెన్యూ గ్రామాలను వచ్చేసమావేశం నాటికి అధికారులు గుర్తించాలన్నారు. ఎంపికైన గ్రామానికి రూ.కోటి ఆర్థికసాయంగా కేంద్రప్రభుత్వం విడుదల చేస్తుందన్నారు. సమావేశంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యానందం, జడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు.



అక్విడెక్ట్‌ను టీడీపీ నేతలతో కలిసి పరిశీలిస్తున్న మండలి బుద్ధప్రసాద్ (ఫైల్)

దివి జీవనాడికి మంచిరోజులు

» అక్విడెక్ట్ పరిరక్షణపై శ్రద్ధ చూపని వైసీపీ » ఐదు నెలల్లో నిధులు విడుదల చేసిన కూటమి ప్రభుత్వం

(అవనిగడ్డ, ఆంధ్రజ్యోతి) : దివి ప్రాంత ప్రజల జీవనాడి అయిన పులిగడ్డ అక్విడెక్ట్ పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల సాగు, తాగునీటి అవసరాలను తీర్చేలా 1936లో పులిగడ్డ అక్విడెక్ట్‌ను నిర్మించారు. ప్రతీ రెండేళ్లకొకసారి ఆపరేషన్ అండ్ మెయింటెన్స్ యాక్షన్ ప్లాన్ కింద ప్రభుత్వం నిధులు విడుదల చేసి అక్విడెక్ట్ మరమ్మతు పనులు నిర్వహిస్తూ వస్తోంది. అయితే వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్విడెక్ట్‌ను పూర్తిగా గాలికి వదిలేయటంతో దాని మనుగడపై స్థానిక ప్రజలు, రైతులు తీవ్ర ఆందోళన చెందారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.54 లక్షలు నిధులు విడుదల చేసిన వైసీపీ ప్రభుత్వం పనులు పూర్తి చేయకుండానే బిల్లులు చేసుకునే ప్రయత్నం చేయటంతో అప్పటి ప్రతిపక్ష టీడీపీ నేతలు మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టారు. టీడీపీ అధికారంలోకి రాగానే అక్విడెక్ట్‌కు పూర్వవైభవం తెస్తామని హామీ ఇచ్చారు.

ఐదేళ్లలో జరిగిందేమీ లేదు..

వైసీపీ 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచి పులిగడ్డ అక్విడెక్ట్ మరమ్మతులపై ఏలాంటి శ్రద్ధ చూపలేదు. దీంతో వరుస వరదల తాకిడికి అక్విడెక్ట్ మనుగడ ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి ఏర్పడింది. నాణ్యతకు తిలోదకాలు ఇచ్చారు. చాంబర్స్ పనిని పూర్తిగా పక్కనపెట్టారు. అక్విడెక్ట్ పొడవునా జాయింట్ ఫిల్లింగ్ కూడా తూతూ మంత్రంగా చేపట్టారు. వరదల కారణంగా అక్విడెక్ట్‌పై ఒత్తిడి పెరిగి యాంకర్ బోల్టు ఛాంబర్లు పూర్తిగా దెబ్బతినటమే కాక అక్విడెక్ట్ పొడవునా జాయింట్లన్ని లీకయ్యే పరిస్థితి ఏర్పడింది. పనులు పూర్తి కాకుండానే నిధులు కాజేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో తెలుగుదేశం పార్టీ ఉద్యమాన్ని చేపట్టడంతో అధికారులు అప్పటివరకు చెల్లించిన పార్ట్ బిల్లులు మినహా మిగిలిన బిల్లులు నిలుపుదల చేసింది.

టీడీపీ పోరాటాల ప్రతిఫలం..

దివి ప్రాంతంలోని దాదాపు 72 వేలఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల ప్రజలకు సాగునీటి అవసరాలను తీర్చే పులిగడ్డ అక్విడెక్ట్ పరిరక్షణకు టీడీపీ పోరాటాల ఫలితం.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే లభించింది. ఇరిగేషన్ శాఖ ఆగస్టు మొదటి వారంలో పంపిన ప్రతిపాదనలు పరిపాలనామోదం పొందాయి. అక్విడెక్ట్ పొడవునా గ్యాప్ ఫిల్లింగ్‌కు యాంకర్ బోల్టులను కాపాడే ఛాంబర్ల నిర్వహణ కోసం, శిథిలావస్థకు చేరిన రెయిలింగ్ బాగుచేసేందుకు ఇరిగేషన్ శాఖ రూ.1.10 కోట్లు కేటాయించేందుకు ఆమోదం తెలిపింది. దీనిపై ఈ ప్రాంత ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

పర్యాటకంగానూ అభివృద్ధి చేస్తాం

- మండలి బుద్ధప్రసాద్, ఎమ్మెల్యే

గడిచిన ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వ నిర్వాకం కారణంగా అక్విడెక్ట్ మనుగడ ప్రమాదంలో పడింది. నాటి టీడీపీ పోరాటాలకు ఎట్టకేలకు ప్రతిఫలం లభించింది. రూ.1.10 కోట్ల నిధులతో అక్విడెక్ట్‌కు అత్యవసరమైన మరమ్మతులన్ని పూర్తిచేయడంతో పాటు ఈ ప్రాంతాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం. భవిష్యత్‌లో అక్విడెక్ట్‌ను సుదీర్ఘకాలం పాటు అక్విడెక్ట్ పరిరక్షణకు వెసులుబాటు కలుగుతుంది.

త్వరలోనే టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తాం

- పులిగడ్డ వెంకటేశ్వరరావు, డీఈ ఇరిగేషన్ శాఖ



అక్విడెక్ట్ పరిరక్షణ కోసం ప్రభుత్వం రూ.1.10 కోట్లు విడుదల చేస్తూ పరిపాలనామోదం తెలిపింది. తొందరలోనే టెండర్లు పిలిచి అక్విడెక్ట్ మరమ్మతుపనులను నాణ్యతతో రాజీ పడకుండా చేపట్టి పూర్తిచేస్తాం. ఇప్పటికే సుందరీకరణ పనులను ప్రారంభించాం. టెండర్లు పూర్తయిన తర్వాత ఆక్విడెక్ట్ పొడవునా సుందరంగా తీర్చిదిద్దుతాము.

మోత మోగింది..!

(3వ పేజీ తరువాయి)

ఉండాలి. దాని సరాసరి ఇప్పుడు 49 మైక్రాన్లుగా రికార్డైంది. పీఎం 10 కేటగిరీలో ఎన్ఏఎంపీ 143, సీఏఏక్యూఎంఎస్ 87, సీఏఏక్యూఎంస్ పీక్స్ 268గా రికార్డైంది. అదే పీఎం 2.5 ఎన్ఏఎంపీ 53, సీఏఏక్యూఎంఎస్ 46, సీఏఏక్యూఎంఎస్ పీక్స్ 140గా రికార్డైంది. దీని ప్రభావం నగరవాసులపై తీవ్రంగా పడుతోంది. మున్ముందు పీఎం స్థాయిల పెరుగుదల ప్రజల ఆరోగ్యానికి సవాల్ విసిరేలా తయారవుతోందని పీసీబీ అధికారులు భావిస్తున్నారు. నగరంలో ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడే వారి సంఖ్య ఏటా పెరుగుతోందని వైద్య వర్గాలు చెబుతున్నాయి. గాల్లో కణాల పీపీఎం పెరిగే కొద్దీ కాలుష్యం పెరుగుతోంది. నగరంలో 50 స్టేషన్ల ద్వారా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గాలి కాలుష్యాన్ని లెక్కిస్తున్నారు. తాజా పరిశీలనలో ఈ పీపీఎంల స్థాయి పెరిగిపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శీతాకాలం ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు.

గ్రీనరీ పెంపుదలే మార్గం

గాల్లో కాలుష్య నివారణకు పచ్చదనాన్ని పెంచడం ఒక్కటే శాశ్వత మార్గమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. రహదారులపై వాహనాల రాకపోకల వల్ల దుమ్ము, ధూళి గాల్లోకి లేస్తాయి. ఇందులో అలర్జీ కారకాలు ఎక్కువ. పొగ, దుమ్ము, ధూళిలో ఈ కారకాలు ఉంటాయి. ఈ కారకాల వల్ల సీవోపీడీ (క్రానింగ్ అబ్‌స్ట్రక్టివ్ పాల్మనరీ డీసీజ్) పెరిగే అవకాశం ఉందని వైద్యులు చెబుతున్నారు. ఈ కారణంగా గుండెజబ్బులు వస్తాయన్నది వైద్యుల అభిప్రాయం. పచ్చదనాన్ని పూర్తిస్థాయిలో పెంచడం వల్ల ఎప్పటికప్పుడు స్వచ్ఛమైన గాలి బయటకు వస్తుందని పర్యావరణవేత్తలు అంటున్నారు.

ప్రభావం తీవ్రమే.. : కె.అనిల్, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధుల నిపుణుడు

గాల్లో కాలుష్యం పెరుగుతున్న మాట వాస్తవమే. దీనికి నిదర్శనమే ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడే రోగుల సంఖ్య పెరగడం. కణాల పరిమాణం తగ్గిపోవడం వల్ల మనం పీల్చే గాలి ద్వారా సులువుగా శరీరంలోకి ప్రవేశిస్తాయి. అవయవాల చివరి వరకు వెళ్తాయి. ఈ కణాల పరిమాణం తగ్గడం చాలా ప్రమాదకరం. శీతాకాలంలో ఈ కణాలు మంచులో ఉండిపోతాయి. మనం పీల్చే గాలి ద్వారా ఇవన్నీ ఊపిరితిత్తులు, శ్వాసకోశాల అట్టడుగు భాగానికి చేరుకుంటాయి. అదే పరిమాణం పెద్దగా ఉంటే లోపలకు ప్రవేశించినప్పటికీ ముక్కు చివరి భాగాన గానీ, అంగుటి వద్ద గానీ ఆగిపోతాయి. వర్షాకాలం, ఎండాకాలంలో ఈ కణాలు నేలపై ఉండిపోతాయి. శీతల వాతావరణంలో మాత్రమే పైకి తేలతాయి. దీని వల్ల అలర్జిక్ బ్రాంకైటీస్, అలర్జిక్ రైనైటీస్, వైరల్ అండ్ బ్యాక్టీరియల్ నిమోనియా వంటి వ్యాధులు సోకుతాయి. ఈ రోగాలు ఉన్నవారు శీతాకాలంలో చాలా ఇబ్బంది పడతారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 555

తేలప్రోలులో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు

ఉంగుటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామంలో సీజనల్ వ్యాధులు, విషజ్వరాలు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నట్లు తేలప్రోలు సర్పంచ్ లాం దిబోర అన్నారు. గ్రామంలోని కొత్తపేట కాలనీలో ప్రొక్లెయినర్‌తో రోడ్లవెంట ఖాళీ ప్రదేశాల్లో పెరిగిన పిచ్చిమొక్కల తొలగింపు, డ్రెయినేజీల పూడికతీత పనులను ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్.రాజేంద్రవరప్రసాద్, వార్డుమెంబర్లు పాల్గొన్నారు.



డ్రెయిన్లలో పూడిక తొలగిస్తున్న ప్రొక్లెయినర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కంకిపాడు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన కోలవెన్ను శివారు మాదాసువారిపాలెంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాదాసువారిపాలెం గ్రామానికి చెందిన విస్సంశెట్టి గణేష్ (18) కోలవెన్ను వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైకు ఢీ కొంది. ఈ ప్రమాదంలో గణేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై తాతాచార్యులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉయ్యూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఎస్సై తాతాచార్యులు తెలిపారు.



విజేతను అభినందిస్తున్న భాష్యం యాజమాన్యం

జాతీయ యోగా పోటీల్లో భాష్యం విద్యార్థికి పతకం

పెనమలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : హిమాచల్ ప్రదేశ్‌లో అక్టోబరు 24 నుంచి 27వరకు జరిగిన జాతీయ సబ్ జూనియర్, జూనియర్ యోగా చాంపియన్‌షిప్‌లో విజయవాడ అశోక్‌నగర్ భాష్యం స్కూల్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి ధీరజ్ శ్రీకృష్ణ పసిడిపతకంతో సత్తా చాటాడని పాఠశాల యాజమాన్యం తెలిపింది. విజేతను భాష్యం విద్యాసంస్థల ఛైర్మన్ రామకృష్ణ, డైరెక్టర్ హనుమంతరావు తదితరులు అభినందించారు.

రాక్ క్లైంబింగ్ శిక్షణ పూర్తి చేసిన వరుణ్‌కు అభినందన

ఉయ్యూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్‌సీసీ కేడెట్ కేపీసీఎస్ వరుణ్ మధ్యప్రదేశ్ గ్యాలియర్‌లో గత నెల 16నుంచి 27తేదీ వరకు జరిగిన ఆలిండియా రాక్ క్లైంబింగ్ ట్రైనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం కె.జోత్స్న దేవి, ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్ జీవీ రమణ, పులువురు ఉపాధ్యాయులు వరుణ్‌ను అభినందించారు. 17వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ విజయవాడ జూనియర్ డివిజన్ నుంచి ఎన్నికైన ఏకైక విద్యార్థి వరుణ్ కావడం విశేషమని ఎన్‌సీసీ ఆఫీసర్ రమణ తెలిపారు.



విజేతలతో కళాశాల యాజమాన్యం

నెట్‌బాల్ పోటీల్లో వీఆర్ సిద్ధార్థకు రెండో స్థానం

పెనమలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : జేఎన్‌టీయూకే ఇంటర్ కాలేజియేట్ నెట్‌బాల్ మహిళల విభాగంలో గత నెల 26, 27 తేదీల్లో భీమవరంలో జరిగిన పోటీల్లో వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల బాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రెండవ స్థానాన్ని కైవసం చేసుకొన్నట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. విజేతల టీం నుంచి జేఎన్‌టీయూకే తరఫున జాతీయస్థాయి పోటీలకు ముగ్గురు విద్యార్థినులు ప్రణీత, మహిమాన్విత, ఉషాకిరణ్మయి ఎంపికైనట్లు తెలిపారు. విజేతలను కార్యదర్శి లక్ష్మణరావు, వీసీ వెంకటేశ్వరరావు, ఏవీ రత్నప్రసాద్, డీన్ పాండురంగారావు తదితరులు అభినందించారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థల వితరణ

గన్నవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కేసరపల్లి సుందరయ్య కాలనీ ఏరియాలో ఉంటున్న గంగిరెద్దుల వారి సంక్షేమంలో భాగంగా కమ్యూనిటీ హాలు ఏర్పాటుకు ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు రూ.30లక్షలు విలువ చేసే స్థలాన్ని వితరణగా అందజేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు ఇచ్చిన హామీలో భాగంగా మూడు సెంట్ల స్థలాన్ని ఇవ్వటం జరిగిందని పొట్లూరి తెలిపారు. దీపావళి పండుగ రోజున రిబ్బన్ కట్ చేసి స్థలాన్ని ఆ పెద్దలకు అప్పగించారు. సర్పంచ్ చేబ్రోలు లక్ష్మీ మౌనిక, ఉప సర్పంచ్ జాస్తి శ్రీధర్‌రావు, శాంతి కిషోర్, బాలకృష్ణ, రామ్ ప్రసాద్, మండవ అన్వేష్ పాల్గొన్నారు.



రిబ్బన్ కట్ చేసి స్థలాన్ని పెద్దలకు ఇస్తున్న ఏఎంసీ మాజీ ఛైర్మన్ పొట్లూరి బసవరావు



గన్నవరంలో మహిళలకు గ్యాస్ సిలిండర్లు అందజేస్తున్న పార్టీ నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు.. రంగన్నగూడెంలో.. ఉంగుటూరులో

పేదల ఇళ్లకు దీపం

- పేదవాడి ఆకాంక్షలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది
- ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు/ గన్నవరం/ హనుమాన్ జంక్షన్ / హనుమాన్ జంక్షన్‌రూరల్/ ఉంగుటూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విశ్వాసముంచి గెలిపించిన జనం రుణం తీర్చుకుంటామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడులో శుక్రవారం నిర్వహించిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, సూపర్‌సిక్స్ పథకంలో భాగంగా ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నామన్నారు. కంకిపాడు మండలంలోని సుమారు 17 వేల మంది లబ్ధిదారులకు లబ్ధి చేకూరతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దేవినేని రాజా, తహసీల్దార్ భవన్నారాయణ, ఎంపీడీవో అనూష, సీనియర్ టీడీపీ నాయకులు తుమ్మల పల్లి హరికృష్ణ, బండి నాంచారయ్య, మండల పార్టీ అధ్యక్షు లు సుదిమళ్ల రవీంద్ర, టీడీపీ, జనసేన సమన్వయకర్త ముప్పా రాజా, స్థానిక పార్టీ నాయకులు చలవాది రాజ, ఏనుగ జయప్రకాష్, పచ్చిపాల రాజా, షేక్ బాజి, పులి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



కంకిపాడులో సిలిండర్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఇతర నాయకులు

పేదల కుటుంబాల్లో వెలుగులు

పేదల కుటుంబాల్లో మరింత వెలుగులు తీసుకొచ్చేందుకు కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను ప్రాధాన్యత క్రమంలో అమలు చేస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు వద్రాణం హరిబాబు నాయుడు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్‌లను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ శివయ్య, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, దొంతు చిన్న, గొడ్డళ్ల చినరామారావు, గుజ్జర్లపూడి బాబూరావు, జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, మేడేపల్లి రమా, దేవినేని సులోచన, చిక్కవరపు నాగ మణి, కాట్రగడ్డ అరుణ, బోడపాటి రవికుమార్, జాస్తి మురళీ, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, ఎంపీటీసీ పడమట రంగా రావు, మండవ అన్వేష్, బీజేపీ, జనసేన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, చిమట రవివర్మ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమానికి పెద్దపీట వేసి ఎన్నికల్లో చేసిన హామీలను నెరవేస్తున్నట్లు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వద్రాణం హరిబాబు తెలిపారు. ఉచిత గ్యాస్ పథకం అమల్లో భాగంగా శుక్రవారం బాపులపాడు ఇందిరానగర్ కాలనీలో లాంఛనంగా మహిళలకు ఉచిత గ్యాస్ సిలెండర్లు పంపిణీ కార్యక్రమం జంక్షన్ పట్టణ కూటమి నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చిరుమామిళ్ల సూర్యం, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయికల్యాణి పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

తెలుగింటి ఆడబిడ్డల కళ్లల్లో ఆనందం చూసేందుకు ఉచిత గ్యాస్ సిలిండర్లను ప్రభుత్వం అందిస్తోందని టీడీపీ నాయకులు ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు వేర్వేరు కార్యక్రమాల్లో అన్నారు. రంగన్నగూడెం, వేలేరు, రేమల్లె, ఆరుగొలను, కాకులపాడు తదితర గ్రామాల్లో ఉచిత వంటగ్యాస్ సిలిండర్ల పథకాన్ని శుక్రవారం వారు ప్రారం భిస్తూ మహిళా లబ్ధిదారులకు సిలిండర్లు అందజేశారు. వేలేరులో పార్టీ అధ్యక్షుడు కాజ సురేష్, పాల సొసైటీ అధ్యక్షుడు దోనవల్లి రామారావు, తలుపుల కోటేశ్వరరావు, వంశీ, మహిళా కమిటీ అధ్యక్షురాలు వల్లూరి రాణి, పాల్గొన్నారు. రంగన్నగూడెంలో సర్పంచ్ కసుకుర్తి రంగామణి, పంచాయతీ కార్యదర్శి పద్మ, టీడీపీ అధ్యక్షుడు మొవ్వా వేణుగోపాల్, పుసులూరి గాంధీ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి సమప్రాధాన్యం

రాష్ట్ర సమగ్రాభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం సమప్రాధాన్యతనిస్తూ ముందుకెళ్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశాల మేరకు మండల కేంద్రమైన ఉంగుటూరులో శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్లను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి ఆళ్ల హనోక్, సర్పంచ్ కాటూరి వరప్రసాద్, సీనియర్ నాయకుడు ఈడ్పు గంటి కృష్ణమూర్తి, నాయకులు పోతినేని రామకృష్ణ, టి.సుబ్రహ్మణ్యం, గరిమెళ్ల వరప్రసాద్, చింతా చంద్రశేఖర్, తహసీల్దార్ జాలాది విమలకుమారి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ

పెనమలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కానూరులో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ కృష్ణాజిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి శంకరబాబు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టి పర్యవేక్షించారు. ఇచ్చిన మాట ప్రకారం సీఎం చంద్రబాబు పింఛన్ల పెంపును చేపట్టి అవ్వాతాతల ముఖాల్లో ఆనందాన్ని నింపారని కొనియాడారు. వెలగపూడి వెంట కొండ్రు కోటేశ్వరరావు ఉన్నారు.

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ మండలం అంబాపురంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ పార్టీ మండల అధ్యక్షుడు గొడ్డళ్ల చిన్నరామారావు సచివాలయ సిబ్బందితో కలసి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.



ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో ప్రమిదలు వెలిగించిన విద్యార్థులు .. కంకిపాడులో మతాబులు కాలుస్తున్న యువతులు

ఘనంగా దీపావళి వేడుకలు


గన్నవరం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో గురువారం దీపావళి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహిళలు సంప్రదాయంగా లక్ష్మీదేవికి పూజలు చేసి ప్రమిదలు వెలిగించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళి జరుపుకుంటున్నట్లు ఆలయాల్లో వేద పండితులు భక్తులకు తెలిపారు. ముస్తాబాద నవభారత్ హైస్కూల్‌లో కరస్పాండెంట్ షేక్ ఇమాం, ప్రిన్సిపాల్ జాకీరా సుల్తానా ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు నిర్వహించారు.

కంకిపాడు : మండలంలోని వివిధ గ్రామాల్లో దీపావళి వేడుకలను కులమతాలకు అతీతంగా ఘనంగా నిర్వహించుకున్నారు. కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ సాయంత్రం నూతన వస్త్రాలను ధరించిన లక్ష్మీపూజ నిర్వహించారు. అనంతరం ఇంటి వాకిళ్లలో దీపాలు వెలిగించి దీపావళి టపాసులు కాలుస్తూ సందడి చేశారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : గ్రామీణ ప్రాంతాల్లో దీపావళి సంబరాలు గురువారం సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. లక్ష్మీపూజ అనంతరం మగపిల్లలు దివిటీలు తిప్పుతూ రోడ్లపై సంబరాలు నిర్వహించగా, ఆడపిల్లలకు తాటాకు, ఉమ్మెత్త కాయలతో చేసిన దీపాలను కలిగిన గుమ్మటాలతో పెద్దలు దిష్టితీశారు. ఇంటిలోగిళ్లను దీపాల వరుసతో అలంకరించారు. చిన్నపెద్ద కలిసి టపాసులకు కాలుస్తూ దీపావళి సంబరాలను నిర్వహించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ఉయ్యూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో సుమారు రూ. 50 కోట్లతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేస్తునట్టు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. గండిగుంటలో రెండు సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆ దిశగా చర్యలు చేపట్టారన్నారు. ముందుగా గండిగుంటలో ఎన్టీఆర్ పింఛన్ల పంపిణీలో బోడె ప్రసాద్, సర్పంచ్ గెత్తం అనుపమ, టీడీపీ నాయకులు సాంబశివరావు, వి. సత్యనా రాయణ, ప్రవీణ్, ఎంపీడీవో శేషగిరిరావు పాల్గొన్నారు.



గండిగుంటలో రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న బోడె ప్రసాద్

కంకిపాడు : ఇచ్చిన మాటకు కట్టుబడి నెల రోజుల్లో రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేసిన ఘనత డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కే దక్కిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడు - రొయ్యూరు వయా గొడవర్రు రోడ్డుకు రూ. 3.75 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులకు ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో అనూష, పీఆర్ డీఈ శ్రీనివాస్, ఏఈ వెంకటేశ్వరరావు, ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, టీడీపీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు సుదిమళ్ల రవీంద్ర, జనసేన పార్టీ సమన్వయకర్త ముప్పా రాజా, స్థానిక టీడీపీ నాయకులు బోసు, కోనేరు సాంబశివరావు, నాని, కోనేరు రాజేష్, వెంకటేశ్వరరావు, వణుకూరు విక్రం, ఏనుగ జయప్రకాష్ పాల్గొన్నారు.

నున్నలో వివాదాస్పదంగా గడ్డర్ ఏర్పాటు

- వైసీపీ పాలనలో ఏర్పాటు చేసిన గడ్డర్
- టీడీపీ అధికారంలోకి రాగానే తొలగింపు
- మూడు రోజుల క్రితం మళ్లీ ఏర్పాటు

విజయవాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నున్న నుంచి వికాస్ కాలేజీ వెళ్లే రోడ్డులో ఇనుప గడ్డర్ ఏర్పాటు వివాదాస్పదంగా మారింది. నిత్యం వందలాది వాహనాల రాకపోకలు సాగించే ప్రధాన రహదారికి మధ్యలో గడ్డర్‌ను ఏర్పాటు చేయడంపై గ్రామంలోని పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. నున్న గ్రామం నుంచి వికాస్ కాలేజీ వెళ్లే మార్గంలో పోలవరం కాలువ ఆంజనేయస్వామి గుడివద్ద రోడ్డుపై గత ప్రభుత్వ హయాంలో ఇనుప గడ్డర్‌ను ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా ఏర్పాటు చేసిన గడ్డర్ కారణంగా అప్పట్లో అనేక సమస్యలు తలెత్తాయి. అయితే అప్పట్లో ప్రధాన రహదారి మధ్యలో గడ్డర్ ఏర్పాటు చేయడాన్ని అనేక మంది గ్రామస్థులు తప్పుబట్టారు. దీంతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే గడ్డర్‌ను తొలగించి వాహనాల రాకపోకలకు వెసులుబాటు కల్పించారు. అయితే తిరిగి మూడు రోజుల క్రితం మళ్లీ అదే ప్రాంతంలో ఇనుప గడ్డర్ ప్రత్యక్షం అవటం తీవ్ర విమర్శలకు తావిస్తోంది.



ఆంజనేయస్వామి గుడివద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన గడ్డర్

పొట్టి శ్రీరాములు జీవితం స్ఫూర్తిదాయకం

హనుమాన్‌జంక్షన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు కారణభూతుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం నేటితరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని మానవత రాష్ట్ర అధ్యక్షుడు మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఏలూరు రోడ్డులోని మానవత కార్యాలయంలో పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ.సత్యనారాయణ, వడ్డి రాజేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, చెక్కా సుబ్బారావు, దయాల ప్రభా కర్, ఘంటా సత్యనారాయణ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

పెనమలూరు : ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని శుక్రవారం కానూరు అశోక్ జిమ్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు రాష్ట్ర అవతరణ కోసం చేసిన త్యాగం గురించి తాళ్లూరి అశోక్ శారద వివరించారు. కార్యక్రమంలో పీ చంటి, లయన్ వైష్ణవి నరేంద్ర, కోటి, ఈదా రాజేష్, పీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

ఉయ్యూరు : విద్యార్థి దశలో లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకుని ఉత్తమ పౌరులుగా మెలగాలని సుధీర్ టింబర్ డిపో అధినేత నూకల వెంకట సాంబశివరావు అన్నారు. ఆయన జన్మదినం పురస్కరించుకుని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ ఇస్మాయిల్, క్లబ్ అధ్యక్షుడు నేరేళ్ల తేజ, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏజీ అండ్ ఎస్‌జీఎస్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నలుగురు విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతిగా రూ. 20 వేలు తన తల్లిదండ్రులు నూకల లింగమూర్తి, సుబ్బమ్మ విద్యాకానుక పేరిట సాంబశివరావు అందజేశారు. ఈ కార్యక్రమంలో రావులపల్లి సుధాకర్, దినవహి ప్రసాద్, రాంబాబు, కుటుంబరాజు, నల్లా శ్రీనివాస్, హనుమంతరావు, సత్తార్, తిరుమలరావు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న నూకల సాంబశివరావు

పోరంకి వేణుగోపాలస్వామి ఆలయంలో అన్నప్రసాదం నేటి నుంచి

పెనమలూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పోరంకి వసంత వేణుగోపాల స్వామి ఆలయంలో శనివారం నుంచి అన్నప్రసాద కార్యక్రమం ప్రారంభించనున్నట్లు అయ్యప్ప భక్తబృంద సభ్యులు తెలిపారు. అన్నప్రసాద కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భవానీలు, శివస్వాములు, ఇతర మాలధారణ స్వాములు పాల్గొనవచ్చని తెలిపారు. అన్న సంతర్పణ కార్యక్రమం జనవరి ఏడు వరకు కొనసాగుతుందని, వివరాలకు 9490994567 నంబరును సంప్రదించాలని భక్తబృంద సభ్యులు కోరారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	123, 132, 143
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555



పింఛను పంపిణీ చేస్తున్న కలెక్టర్ బాలాజీ

గూడూరులో కలెక్టర్ పింఛన్ల పంపిణీ

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గూడూరులో కలెక్టర్ డి.కె.బాలాజీ పింఛన్ల పంపిణీ చేశారు. గొరిపర్తి లక్ష్మణరావు, గొరిపర్తి జయలక్ష్మి, బచ్చుల కృష్ణలకు ఒక్కొక్కరికి రూ.4వేల చొప్పున అందజేశారు. కలెక్టర్ బాలాజీ మాట్లాడుతూ, ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఒకటో తేదీనే పింఛన్ల పంపిణీకి అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. మొదటి రోజునే నూరు శాతం పింఛన్ల పంపిణీకి కృషి చేయాలని సంబంధిత సచివాలయ సిబ్బందికి సూచించారు.

బడే గౌతమ్‌పై చర్యలు కోరుతూ

పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు

చల్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : విద్వేషాలు రెచ్చగొడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రవర్తిస్తున్న న్యాయవాది బడే గౌతమ్‌పై చర్యలు తీసుకోవాలని మండల టీడీపీ నేతలు కోరారు. ఈమేరకు చల్లపల్లి ఎస్సై పిఎస్‌వి.సుబ్రహ్మణ్యంకు టీడీపీ నేతలు లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు. టీడీపీ నేతలు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, పైడిపాముల కృష్ణకుమారి, రావి చిట్టి, నిడమానూరి దిలీప్‌కుమార్, నాదెళ్ల వెంకట నరసయ్య, షేక్ సిలార్, తాతా ప్రదీప్, అనగాని నాగేశ్వరరావు, మేడికొండ రవి బాబు తదితరులు పాల్గొన్నారు. **మోపిదేవి** : బడే గౌతమ్‌పై చర్యలు తీసుకోవాలంటూ కూటమి నేతలు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ మండల పార్టీల అధ్యక్షులు నడకుదుటి జనార్ధనరావు, పూషడపు రత్నగోపాల్, సనకా ప్రశాంత్; పార్టీల నాయకులు పాల్గొన్నారు. **నాగాయలంక** : న్యాయవాది బడే గౌతమ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతూ, మండల టీడీపీ అధ్యక్షుడు మెండు లక్ష్మణ రావు, తెలుగు మహిళ జిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత ఆధ్వర్యంలో శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారితో పాటు కూటమి నేతలు పాల్గొన్నారు. **కోడూరు** : మండలి బుద్ధప్రసాద్ చిత్రపటాలు ఉన్న ఫ్లెక్సీని తగలబెట్టిన బడే గౌతమ్‌పై కోడూరు పోలీస్ స్టేషన్‌లో మండల టీడీపీ, జనసేన నేతలు ఫిర్యాదు చేశారు. మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, నాయకులు పూతబోయిన శ్రీనివాసరావు, వేములపల్లి రాజేష్, ఉల్లి శేషగిరి రావు, నాగం రఘు, గాదె రమేష్, గోగినేని సోమశేఖరరావు, పిల్లి మల్లిఖార్జు రావు, లంకే రవి, తాతా శ్రీరామమూర్తి, దావు చిన్నబాబు, జాన్ విల్సన్, కాగిత ప్రసాద్, మల్లి, ఇమ్రాన్, యార్లగడ్డ రమణ, గుమ్మడి రవీంద్ర, చింతల రమేష్, తుంగల రాజేష్, పోతుల నాగ రాజు, గాదె అనిల్, బడే వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీ గూడూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ



గూడూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

గూడూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సమస్యలతో వచ్చిన ప్రజలకు సత్వరమే న్యాయం జరిగేలా కృషి చేయాలని డీఎస్పీ అబ్దుల్ సుభాన్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం రాత్రి గూడూరు పోలీసు స్టేషన్‌ను డీఎస్పీ తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. డీఎస్పీ అబ్దుల్ సుభాన్ మాట్లాడుతూ, స్టేషన్‌లో కేసులు పెండింగ్ లేకుండా చూడాలన్నారు. సిబ్బందికి ఉన్న సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఎస్సై కె.ఎన్.వి. సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుల బెడద నివారించాలని వినతి

పెడన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఆవుల బెడద తొలగించాలని కోరుతూ పట్టణానికి చెందిన రైతులు శుక్రవారం కమిషనర్ ఎం. గోపాలరావుకు వినతిపత్రం సమర్పించారు. ఆవులు రోడ్లపై సంచరిస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయని, రాత్రి పొలాల్లో పంటలను నాశనం చేస్తున్నాయని పేర్కొన్నారు. ఆవులను వదులుతున్న వాటి యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, విచ్చలవిడిగా సంచరిస్తున్న ఆవులను పట్టి బంధించి గోశాలకు తరలించాలని రైతులు కమిషనర్‌ను కోరారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికలకు పట్టభద్రుల ఈనెల 6లోగా ఓటరుగా నమోదు చేసుకోవాలని సీనియర్ టీడీపీ నాయకుడు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. కూటమి ప్రభుత్వం వంద రోజుల్లోనే మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిందన్నారు. మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు మోటూరి శంకరరావు మాట్లాడుతూ, త్వరలో అన్ని నియోజకవర్గాల్లో మాజీ సైనికుల కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గోపాలకృష్ణ, వై. రమేష్‌కుమార్, రాంబాబు, ఐ. రత్నప్రసాద్, ఆదినారాయణ, వసంతరావు, బదరీప్రసాద్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ఐదో డివిజన్లో పింఛన్లు పంపిణీ చేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కొనకళ్ల, బండి రామకృష్ణ



ముంజులూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న కాగిత కృష్ణప్రసాద్



గ్యాస్ సిలిండర్ల పంపిణీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మండలి

చిత్తశుద్ధితో హామీల అమలు

• మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు చిత్తశుద్ధితో కృషి చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఐదో డివిజన్‌లో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ రావు, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ పింఛన్లు పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మునిసిపల్ మాజీ వైస్‌చైర్మన్ పంచపర్వాల కాశీవిశ్వనాథం, సచివాలయ కార్యదర్శులు అనిల్‌బాబు, బి. రమేష్‌బాబు, ఏ. శివరామకృష్ణ, ఎం. పవన్‌కుమార్, ఎండి పాతిమా, శ్రీదేవి, వీఆర్‌ఓ శాంతి, రత్నాకర్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర ఎన్టీఆర్ కాలనీలో పింఛన్లు ఇచ్చిన సందర్భంలో పలువురు బాధితులు తమ సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.తనకు పింఛను రావడం లేదని, 83 శాతం వైకల్యం ఉందని, ఐదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నానని కూరేటి మహాలక్ష్మి తెలిపింది. పేదరాలైన తనకు ఇల్లు మంజూరు చేయలేదని ఏ. లక్ష్మి తన సమస్యను విన్నవించుకుంది. గతంలో ఇస్తున్న పింఛనును ఆపివేశారని యార్లగడ్డ విజయలక్ష్మి వాపోయింది. తనకు వైసీపీ ప్రభుత్వంలో పక్కా ఇల్లు మంజూరు చేశారని, కాంట్రాక్టర్‌కు డబ్బులిచ్చినా ఇల్లు పూర్తి చేయలేదని మద్దూరు శారద తెలిపారు. ఏడు నెలల క్రితం లారీ ఢీకొన్న ప్రమాదంలో గాయపడి నడవలేని జొన్నలగడ్డ శివప్రసాద్‌ను మంత్రి పలకరించారు.

కానూరులో గోపు సత్యనారాయణ

మచిలీపట్నం టౌన్ : పింఛన్లు పెంపుదల వల్ల వృద్ధులు, దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ అన్నారు. మండలం కానూరు గ్రామంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొన్నారు. బొమ్మిడి ఏడుకొండలు, పీతా రాము, మోపిదేవి కృష్ణ, చిటికిన అయ్యప్ప, దివి మహేష్, బొలిశెట్టి నాని, గోపు వెంకటరమణ, మోకా వెంకన్న, వంకా కాశీ, బొమ్మిడి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ముంజులూరులో పింఛన్ల పంపిణీ

బంటుమిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముంజులూరులో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. నియోజకవర్గ పరిశీలకులు సాదరబోయిన ఏడుకొండలు పాల్గొని వృద్ధులు, వికలాంగులకు పెన్షన్లు పంపిణీ చేశారు. కూనపరెడ్డి వీరబాబు, జోగి గౌరిశంకర్, వేముల నాంచారయ్య, జనసేనా నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

అవనిగడ్డలో దీపం-2 ప్రారంభం

అవనిగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. అవనిగడ్డలోని విజయకృష్ణ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయంలో దీపం -2 కార్యక్రమాన్ని శుక్రవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లను కూటమి ప్రభుత్వం ఉచితంగా ఇస్తానని చెప్పిన మాట నిలబెట్టుకోవటం శుభపరిణామమన్నారు. ఎంపీపీ సుమతి, రావి దుర్గావాణి, కోట విజయరాధిక, ఎంపీడీవో మరియాదేవి, తహసీల్దార్లు నాగమల్లేశ్వరరావు, హరనాథ్, సర్పంచ్ కృష్ణకుమారి, తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత, మాజీ ఎంపీపీలు బండే కనకదుర్గ, మోర్ల జయలక్ష్మి, జనసేన మండల అధ్యక్షులు గుడివాక శేషుబాబు, బచ్చు విజయలక్ష్మి, యాసం చిట్టిబాబు మోర్ల రాంబాబు, స్వప్న, కె.కొత్తపాలెం సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి, గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు మత్తి శ్రీనివాసరావు, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, బచ్చు కృష్ణకుమారి, యార్లగడ్డ శ్రీనివాసరావు, నాదెళ్ల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

పెడనలో కాగిత కృష్ణాప్రసాద్ ఆధ్వర్యంలో

పెడన, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటిని కూటమి ప్రభుత్వం తప్పకుండా నెరవేరుస్తుందని ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ అన్నారు. భారత్‌గ్యాస్ కంపెనీ ఆవరణలో దీపం-2 పథకం కింద ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీని ప్రారంభించారు. కృష్ణప్రసాద్ కొన్ని ప్రాంతాలలో ఇంటింటికీ వెళ్లి గ్యాస్ సిలెండర్లు పంపిణీ చేశారు. నవ్యభారత్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పిన్నింటి మహంకాళినాయుడు, తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, మునిసిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ ఖయూం, జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త పంచకర్ల సురేష్, కౌన్సిలర్ మట్టా శివపావని, 15వ వార్డు టీడీపీ ఇన్‌చార్జి ఖుర్షిద్‌బేగం పాల్గొన్నారు.

రూ.10 కోట్లతో బందరులో రోడ్లు, డ్రైయిన్ల అభివృద్ధి



ఫత్తుల్లాబాద్‌లో కల్వర్టుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం నగరంలో రోడ్లు, డ్రైన్లను రూ.10 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఫతుల్లాబాద్ వద్ద కల్వర్టు నిర్మాణానికి మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, కలెక్టర్ బాలాజీ, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము శంకుస్థాపన చేశారు. నగరం ముంపునకు గురి కాకుండా నాలుగు చోట్ల పంపింగ్ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. మునిసిపల్ మాజీ చైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, కమిషనర్ బాపిరాజు, టీడీపీ కార్పొరేటర్లు అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ భరత్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు

కార్పొరేట్ బార్బర్ షాపును నిలిపివేయాలి

బంటుమిల్లి, నవంబరు1 (ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లిలో కార్పొరేట్ స్థాయిలో బార్బర్ షాపులను ఏర్పాటు చేయడాన్ని వ్యతిరేకిస్తూ తహసీల్దార్ భరత్‌రెడ్డికి బంటుమిల్లి వినాయక నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అర్జీ ఇచ్చారు. ఈ విషయమై ఎమ్మెల్యేకు కూడా గతంలో అర్జీ అందజేశామన్నారు. బార్బర్ షాపు ఏర్పాటు పనులు చకచకా జరుగుతుండడంతో షాపు ఎదుట నిరసన తెలియజేసి తహసీల్దార్‌కు అర్జీ ఇచ్చారు. బంటుమిల్లిలో ఏర్పాటు చేస్తున్న షాపును తొలగించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని సంఘం నేతలు హెచ్చరించారు. కొమ్మలపాటి రవి, ముత్యాపల్లి వెంకట శివరామ్, పొదిలి వెంకన్న, మాటూరి సురేంద్ర కమార్, దేవరపల్లి శ్రీను, మేడూరి శివసాయి, దుర్గారావు, బి. వెంకటేశ్వరరావు, నవీన్, హరి, శేషు, కే.సాయి, బాలాజీ, తుమ్మిడి శివ, కే.కోటి, తదితర నాయీబ్రాహ్మణ కులస్థులు పాల్గొన్నారు.

మద్యం షాపు ఏర్పాటు విరమించాలని విద్యార్థుల ఆందోళన

అవనిగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వందలాది మంది విద్యార్థులు వెళ్లే కళాశాల దారిలో మద్యం షాపు పెట్టాలన్న ఆలోచన విరమించుకోవాలని ఎస్‌విఎల్.కళాశాల విద్యార్థినీ, విద్యార్థులు కోరారు. అవనిగడ్డ ఎస్‌విఎల్ కళాశాలలో దాదాపు రెండు వేల మందికిపైగా విద్యార్థులు ఇంటర్, డిగ్రీ చదువుతున్నారని, కళాశాలకు అతి సమీపంలో మద్యం షాపు ఏర్పాటు చేస్తే అది విద్యార్థుల చదువుపై ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని వెంటనే మద్యం షాపు ఏర్పాటు ప్రతిపాదనను విరమించుకోవాలని కళాశాల విద్యార్థులు కోరారు. కళాశాల విద్యార్థులు నిర్వహించిన నిరసనలో కళాశాల కరస్పాండెంట్ దుట్టా మహేశ్వరరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో అవస్థలు

మోపిదేవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సర్వర్లు మొరాయించటంతో సామాజిక పింఛన్ల పంపిణీ ప్రక్రియలో శుక్రవారం తెల్లవారుజామున ఇబ్బందులు ఎదురయ్యాయి. తెల్లవారుజాము 5.30 గంటల నుంచే పింఛన్ల పంపిణీ చేపట్టగా, ఉదయం 7 గంటల నుంచి సర్వర్ మొరాయించింది. తిరిగి 10.30 గంటల వరు సర్వర్ పనిచేయక పింఛన్ల పంపిణీకి ఉద్యోగులు ఇబ్బందులు పడ్డారు. మండలంలో 85 శాతం మేర పింఛన్లు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు.



ప్రమాద బాధితునికి ఆర్థిక సాయం

ఘంటసాల, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాద బాధితునికి ప్రముఖ పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. జోడుగూడెం దళితవాడకు చెందిన చిట్టూరి లోకేశ్వరరావు రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయపడ్డాడు. చికిత్స అనంతరం ఇంటి వద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న విక్కుర్తి శ్రీనివాస్ బాధితుని పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితునికి రూ.10 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. విక్కుర్తి రాం బాబు, పురిటిగడ్డ చంద్ర, భూపతి నాంచారయ్య, రేపల్లె ముసలయ్య, దోనె వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కొత్తపేట పుష్కరఘాట్ వద్ద సౌకర్యాలు కల్పించాలి

అవనిగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం పుణ్యస్నానాలు నిమిత్తం వచ్చే ప్రజలకు ఘాట్ నందు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని విక్కుర్తి శ్రీనివాస్ పంచాయతీ అధికారులను కోరారు. అవనిగడ్డ శివారు కొత్తపేట పుష్కరఘాట్‌ను ఆయన పరిశీలించారు. కార్తీక పుణ్యస్నానాలకు వచ్చే మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ముఖ్యంగా గాజు పెంకులు తొలగించి లైట్లను ఏర్పాటు చేయాలని శ్రీనివాస్ పంచాయతీ వారిని కోరారు.



చిన్నాపురంలో టీడీపీ సభ్యత్వ నమోదులో కాగిత వెంకటేశ్వరరావు, గోపాలరావు

టీడీపీ సభ్యత్వంతో రూ.5లక్షల బీమా రక్షణ

మచిలీపట్నం టౌన్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వంతో రూ. 5 లక్షల బీమా రక్షణ కలుగుతుందని మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నాపురంలో ఆయన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం వేగంగా సాగుతోందన్నారు. చిన్నాపురం గ్రామ సర్పంచ్ కాగిత గోపాలరావు, మాజీ జడ్పీటీసీ సభ్యుడు లంకే వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పినిశెట్టి నిరంజన రావు, కేసన రమేష్‌బాబు, కేసన నాగరాజు, టంటం నరసింహారావు, జనసేన నాయకులు కాట్రం నాంచారయ్య, చలమలశెట్టి రమణ, మాజీ సర్పంచ్ పరంజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిబాధితులకు సాయం

నాగాయలంక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : అగ్ని ప్రమాద బాధితులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ అన్నారు. పర్రచివర గ్రామంలో మెండు నాగమల్లేశ్వరరావు పూరిల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా పూర్తిగా కాలిపోయింది. బాధిత కుటుంబాన్ని శుక్రవారం వెంకట్రామ్ పరామర్శించి రూ.5 వేలు ఆర్థిక సహాయం, దుప్పట్లు, నూతన వస్త్రాలు అందజేశారు. మండల టీడీపీ అధ్యక్షులు మెండు లక్ష్మణరావు (చంటి) రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నాగాయలంక సబ్ బ్రాంచ్ చైర్మన్ భోగాది శివ విష్ణువర్ధన్ 25 కేజీల బియ్యం, వంటపాత్రలు అందజేవారు. తహసీల్దార్ హరనాథ్ నిత్యావసర సరుకులు అందజేశారు. కూటమి నేతలు, అధికారులు పాల్గొన్నారు.

పూరిల్లు దగ్ధం

నాగాయలంక, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పర్రచివర శివారు దుర్గాప్రసాద్‌పురంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గురువారం మెండు నాగమల్లేశ్వరరావు పూరిల్లు పూర్తిగా దగ్ధమైంది. . సుమారు రూ.6 లక్షల 50 వేలు ఆస్తి నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. రెండు నిట్టాడుల తాటాకుల ఇల్లు, బంగారం, వెండి వస్తులతోపాటు రెండు లక్షలు నగదు, రేషన్ కార్డు, ఆధార్ కార్డులు, పొలం పాస్ పుస్తకాలు, బ్యాంక్ అకౌంట్ పుస్తకాలు, పిల్లల సర్టిఫికెట్స్ దగ్ధమయ్యాయి. వీఆర్వో టి.జి.ఎస్.సాయిబాబు ఘటనా స్థలాకి వెళ్లి వివరాలను సేకరించారు. బాధితులకు ప్రభుత్వం నుంచి తక్షణ సాయం అందుతుందని తహసీల్దార్ ఎం.హరనాథ్‌బాబు తెలిపినట్లు వీఆర్వో చెప్పారు.

ఘంటసాలపాలెంలో ఇల్లు దగ్ధం

ఘంటసాల, అక్టోబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలపాలెం ఘోటకం దళితవాడలో గురువారం రాత్రి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఉప్పులేటి సుదర్శన్ - లావణ్య దంపతులు దగ్ధమైంది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. కాలనీ వాసులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. గృహోకరణాలు, బట్టలు, ఫర్నీచర్ తదితర సామాగ్రి, విద్యార్థుల పుస్తకాలు కాలిబూడిదయ్యాయి.

బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలు

మోపిదేవి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మోపిదేవిలో గురువారం రాత్రి జరిగింది. కోడూరు మండలం విశ్వనాథపల్లికి చెందిన నాగ సుధాకర్, మోపిదేవికి చెందిన అశోక్ కుమార్ బైక్‌లపై ఎదురెదురుగా వస్తూ మోపిదేవి ఎస్.విహార్ హోటల్ సమీపంలో పరస్పరం ఢీకొట్టుకున్నారు. గ్రామస్థుల సమాచారంతో గాయపడిన వారిద్దరినీ 108 అంబులెన్స్‌లో అవనిగడ్డ ఏరియా ఆసుపత్రిలో చేర్పించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం మచిలీపట్నం జిల్లా ఆసుపత్రికి తరలించారు. మోపిదేవి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యకర్త కుటుంబానికి కనపర్తి సాయం

చల్లపల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : పాతమాజేరుకు చెందిన టీడీపీ కార్యకర్త చలమలశెట్టి సూరిబాబు అనారోగ్యంతో మృతి చెందగా కుటుంబ సభ్యులను టీడీపీ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పరామర్శించారు. రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. పైడిమ్మను పరామర్శించి కుమారుడి ఉన్నత విద్యకు భరోసా ఇచ్చారు. కొల్లూరు వెంకటేశ్వరరావు, అగ్గిరాముడు, తుమ్మలగుంట గోపాలకృష్ణ, కమ్మిలి పెద బాబు, నాగార్జున, రవితేజ పాల్గొన్నారు.

ఎస్‌వీఎల్ కళాశాలలో మ్యూజికల్ నైట్

అవనిగడ్డ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఎస్‌విఎల్ కళాశాలలో దీపావళి వేడుకల్లో భాగంగా శుక్రవారం మ్యూజికల్ నైట్ నిర్వహించారు. కళాశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన మ్యూజికల్ నైట్‌ను కళాశాల కరస్పాండెంట్ దుట్టా ఉమామహేశ్వరరావు పర్యవేక్షించారు.

రక్షిత నీటి పథకం పరిశీలన

బంటుమిల్లి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): దుర్గంధం, దుర్వాసన వస్తున్న మల్లేశ్వరం మెగా రక్షిత మంచినీటి పథకం చెరువును శుక్రవారం బంటుమిల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి పవన్‌కుమార్ పరిశీలించారు. చెరువులో రంగుమారిన నీరు, చనిపోయిన చేపలు తేలియాడుతున్నాయి. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్య ధోరణితో కలుషితమైన నీటిని సరఫరా చేస్తూ ప్రజల ప్రాణాలతో చలగాటం ఆడుతున్నారు. ఎంతో కాలంగా బంటుమిల్లి, కృత్తివెన్ను మండలాల్లో 16 గ్రామాలకు చెందిన ప్రజలకు ఈ నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతానని డాక్టర్ పవన్‌కుమార్ తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	123,132, 143
చికెన్ విత్ స్కిన్	234
చికెన్ స్కిన్‌లెస్	244

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.555

గుడివాడ అభివృద్ధికి రూ.10 కోట్ల నిధులు మంజూరు

గుడివాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి రూ.10 కోట్లు నిధులు మంజూరైనట్టు ఎమ్మెల్యే రాము కార్యాలయం నుంచి గన్నవరం విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కె తులసీబాబు శుక్రవారం ప్రకటనను విడుదల చేశారు. పట్టణంలోని పలు వార్డుల్లో రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి రూ.4 కోట్లు, 30వ వార్డు దనియాలపేటలో రహదారులు, డ్రెయినేజీల అభివృద్ధికి రూ.3 కోట్లు, వాంబే కాలనీ అభివృద్ధికి రూ.1.50 కోట్లు, న్యూ ఇందిరా నగర్‌కాలనీలకు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖలు అదేశాలు జారీ చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.



ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఐ ధర్నా

ట్రూ అప్ చార్జీలు విరమించాలి

గుడివాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్ చార్జీలను, ట్రూ అప్ చార్జీలను విరమించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి టి. తాతయ్య డిమాండ్ చేశారు. నెహ్రూచౌక్ సెంటర్‌లో నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి గూడపాటి ప్రకాష్ బాబు ఆధ్వర్యంలో పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే తగ్గించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. తాతయ్య మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం బాటలోనే కూటమి ప్రభుత్వం నడుస్తోందని దుయ్యబట్టారు. సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి సత్యనారాయణ, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల వెంకట నరసింహరావు, పట్టణాధ్యక్షులు పి.శేషు, పి.రంగారావు, బాపనయ్య, గిరి, అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాలయ భాస్కర్‌కు ఘన సత్కారం



గుడివాడ, నవంబరు (ఆంధ్రజ్యోతి) : అబ్దుల్ కలాం జాతీయ అవార్డు అందుకున్న విద్యాలయ విద్యాసంస్థల డైరెక్టర్ బొప్పన వెంకట విజయ భాస్కర్‌ను పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో పోస్టల్ సూపిరింటెండెంట్ చల్లా అప్పారావు సత్కరించారు.విద్యాలయ పాఠశాల ఆవరణలో విజయభాస్కర్‌ను సత్కరించి అయోధ్య రాముని స్టాంపు, జ్ఞాపికను బహూకరించారు. విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న విజయభాస్కర్‌కు అవార్డు రావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ ఇనిస్పెక్టర్ ఎస్.శ్రీనివాస్, గోళ్ల ప్రసాద్, పోస్టల్ సిబ్బంది, విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


ఈడ్పుగంటి వర్ధంతి కార్యక్రమంలో ఎమ్మెల్యే కామినేని

ఈడ్పుగంటి వర్ధంతి సందర్భంగా వైద్యశిబిరం ఏర్పాటు హర్షణీయం

● కైకలూరు ఎమ్మెల్యే కామినేని

గుడివాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కీ.శే ఈడ్పుగంటి వెంకట్రామయ్య జ్ఞాపకార్థం కుటుంబసభ్యులు ఉచిత వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఈవీఆర్ ఆసుపత్రిలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ ఈడ్పుగంటి వెంకట్రామయ్య తొమ్మిదో వర్ధంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించారు. తొలుత వెంకట్రామయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఈడ్పుగంటితో తనకున్న అనుబంధాన్ని ఎమ్మెల్యే కామినేని గుర్తు చేసుకున్నారు. విమానాశ్రయ అభివృద్ధి కమిటీ సభ్యులు తులసీ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, డాక్టర్ ఈడ్పుగంటి రాజ్యలక్ష్మీ, డాక్టర్ కర్నాటి రాజేంద్ర, ఈడ్పుగంటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


రామేశ్వరిని సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మణరావు

మహిళా రక్షణపై సెమినార్

గుడ్లవల్లేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : వీవీఐపీఎస్ ఫార్మాస్యూటికల్ కళాశాలలో ఉమెన్ సేఫ్టీ - అంబాసిడర్ వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ రెడ్డీస్ లాబొరెటరీస్ సైంటిస్ట్ రామేశ్వరి పాల్గొన్నారు. మహిళలు, విద్యార్థినులకు రక్షణ కల్పించే యాప్‌లను వివరించారు.అనంతరం పాఠశాల యాజమాన్యం ఆమెను సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.లక్ష్మణరావు, అధ్యాపకులు బాలకృష్ణ, సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.


పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కుమార్ రాజా

పేదరికం లేని సమాజమే ధ్యేయం

పామర్రు, నవంబరు 1 : పేదరికం లేని సమాజ స్థాపనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. పాతపోలీస్‌స్టేషన్ వద్ద శుక్రవారం గ్రామ సచివాలయ ఉద్యోగులతో కలిసి పేదలకు ఎన్టీఆర్ సామాజిక భోరోసా పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేతలు పాల్గొన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోస పింఛన్లను గ్రామ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ కార్యదర్శి కంఠమనేని పల్లవి, అగ్రికల్చర్ అసిస్టెంట్ కిరణ్ , సృజన్,రాజు హౌస్సెస్, ఎంఎస్‌కె శ్రీలత, స్వాతి, వీఆర్వోలు ఉషా కుమార్‌లతో కలిసి పంపిణీ చేశారు. పంచాయతీ సభ్యులు మంతెన రామాంజనేయులు, టి.మధు, కోటి, పాండు, పరసా సుబ్రహ్మణ్యం , అనిల్, దాసరి కొండ తదితరులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణం విచిత్రం




చిత్రం గ్రామంలో అధ్వానంగా ఉన్న శ్మశానవాటిక రహదారి

● ప్రధాన మంత్రి సడక్ యోజన కింద 2018లో నిధులు మంజూరు
● నిధులు చాలక 3 కి.మీ. మేర నిలిచిన రహదారి
● వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పూర్తి కాని రహదారి
● కూటమి ప్రభుత్వం దృష్టి సారించాలని గ్రామస్థుల వినతి

(ఆంధ్రజ్యోతి-గుడ్లవల్లేరు)

ప్రధాన మంత్రి గ్రామ సడక్ యోజన పథకం కింద 2018లో చంద్రాల నుంచి పెంజంద్ర వరకు రహదారి నిర్మాణానికి రూ.9 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఆ మార్గంలోనే చిత్రం గ్రామం ఉండటంతో గ్రామస్తులు తమ రహదారి కష్టాలు తీరినట్టే అనుకున్నారు. ఎన్నికలు రావడం, ప్రభుత్వం మారడంతో రహదారి నిర్మాణంలో జాప్యం అయ్యింది. నేటికీ ఈ రహదారి నిర్మాణం పెంజంద్ర వరకు వెళ్లలేదు. దాదాపు మూడు కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణం నిలిపి వేయడంతో చిత్రం గ్రామస్థులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చిత్రం గ్రామంలో హిందూ శ్మశాన వాటికకు వెళ్ళే రహదారి అధ్వానంగా తయారై నడవడానికి కూడా వీలు లేని విధంగా ఉంది. ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలు చేయాలంటే నరకం కన్పించేంది. అడుగు తీసి అడుగు వేయలేని స్థితిలో బాధలు వర్ణనాతీతం. ఇటీవల ఒక పెద్దాయన కాలం చేస్తే ఆ రహదారిలో తీసుకెళ్ల లేక రెండు కిలోమీటర్ల దూరం తీసుకెళ్లి కాల్వ గట్టునే అంతిమ సంస్కారాలు నిర్వహించారంటే అక్కడి ప్రజానికం ఇబ్బందులు అర్థం చేసుకోవచ్చు. శ్మశానవాటిక రోడ్డే కాక గ్రామంలోని రైతులందరూ ఆ మార్గం దాటి పెంజంద్ర డొంకలోని పొలాలకు వెళ్లాలి. రైతులు నిత్యం చేలకు ఎరువు లు, పురుగు మందులు తీసుకుని ఈ రహదారిలో వెళ్లడం దుర్లభంగా ఉంది. శ్మశాన వాటిక రోడ్డు వరకైనా రహదారి నిర్మాణం జరగలేదని అధికారులను గ్రామస్థులు అడిగితే, నిధులు అక్కడివరకే సరిపోయాయని చెప్పి చేతులు దులుపేసుకొన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా దృష్టి సారించి ఈ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని చిత్రం గ్రామస్థులు కోరుతున్నారు.

గ్రావెల్ రోడ్డన్నా వేయించండి



చేలకి మందులు వేయాలన్నా, చూసి రావాలన్నా ఈ రోడ్డులో నడవలేక పోతున్నాం. కనీసం గ్రావెల్ రోడ్డన్నా వేయించండి

\- పాగోలు శ్యామ్ బాబు

శవాన్ని మోసుకెళ్లాలంటే నరమే



హిందూ శ్మశాన వాటికకు శవాన్ని మోసు కెళ్లాలంటే నరకం కనిపిస్తోంది. తక్షణం అధికారుల స్పందించాలి.

\- బట్టు రాజు

అంచనాలు రూపొందిస్తాం



బదిలీపై కొత్తగా వచ్చా. గ్రామస్థులు రహదారి సమస్యను చెప్పారు. అంచనాలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతా.

-నాగేశ్వరరావు, పంచాయతీరాజ్ జేఈ

భీమేశ్వరస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు

గుడివాడ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి) : బంటుమిల్లి రోడ్డులోని భీమేశ్వర స్వామి దేవస్థానం హుండీల లెక్కింపు 2వ తేదీ శనివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ కార్య నిర్వహణాధికారి కె.వి గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.


దీపం -2 ప్రారంభం సందర్భంగా గ్యాస్ సిలిండర్ మోసుకెళ్తున్న కుమార్‌రాజా



గుడ్లవల్లేరులో ఉచిత గ్యాస్ సిలిండర్ అందజేస్తున్న కూటమి నాయకులు

దీపం-2 పథకం గ్యాస్ సిలిండర్ల పంపిణీ

పామర్రు, నవంబరు 1,(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చినవందరోజుల వ్యవధిలోనే ఉచిత గ్యాస్ పథకం అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా అన్నారు. పామర్రులో శుక్రవారం ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సిలిండర్లను బుక్ చేసుకున్న 48 గంటల్లోపు రాయితీ సొమ్ము లబ్దిదారుల బ్యాంకు ఖాతాకు జామచేయనున్నారని వివరించారు. గ్రామ సర్పంచ్ కస్తూరి, జనసేన పామర్రు నియోజకవర్గ ఇన్‌చార్జి తాడిశెట్టి నరేష్, తెలుగురైతు ప్రధాన కార్యదర్శి వల్లూరిపల్లి గణేష్, తహసీల్దార్ గూడపాటి రవికాంత్, ఎంపీడీవో కెజ్యోతి, కార్యదర్శి అబ్దుల్ సలీం, పీడీఎస్ డీటీ రంగారావు, కొడాలి శ్రీనివాస్, సీఐ శుభాకర్, ఎస్సై సిహెచ్ అవినాష్, గుంప గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : సూపర్ సిక్స్‌లో భాగంగా మహిళలకు మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాన్ని అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కిందని నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ అన్నారు. గుడ్లవల్లేరులోని కొసరాజు బాపయ్య చౌదరి సభావేదికలో శుక్రవారం సాయంత్రం దీపం-2 పథకం కింద గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఆయన ప్రారంభించారు. టీడీపీ సీనియర్ నాయకులు జంగం మోహనరావు, వెనిగండ్ల రామకృష్ణ(నాని), పొట్లూరి రవికుమార్, చాపరాల బాలాజీ, మల్లా రామారావు, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దావులూరి సురేంద్ర బాబు, తహ సీల్దారు లోకరాజు, వీఆర్వో ప్రకాష్, శివకుమార్, పంచాయతీ కార్యదర్శి నరసింహారావు, వల్లూరుపల్లి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ గుత్తా శివరామకృష్ణ సంయుక్త ఆధ్వర్యంలో దీపం-2 పథకాన్ని శుక్రవారం ప్రారంభించారు. మండల టీడీపీ నాయకులు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జనార్దనపురంలో..

నందివాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): జనార్ధనపురంలో కూటమి నాయకులు బూరగడ్డ శ్రీకాంత్, వెనిగండ్ల రామకృష్ణ (నాని) ఉచిత గ్యాస్ పంపిణీ ప్రారంభించారు. తహసీల్దార్ ఎస్.గురుమూర్తి, సివిల్ సప్లయాస్ డీటీ కిరణ్ కుమార్, ఆర్ఐ గణేష్, మండల టీడీపీ అధ్యక్షుడు సన్యాసిరావు, చాట్రగడ్డ రవి, మసిముక్కు వేణుగోపాల్, ప్రభాకర్ రెడ్డి, అంజిరెడ్డి, గూడపాటి వెంకటేశ్వరరావు, నాగరాజు, అంబేద్కర్, వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.


బొమ ్ములూరు, జనార్దనపురంలో సిలిండర్లు పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

బొమ్ములూరులో..

గుడివాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : బొమ్ములూరులోజనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మండల టీడీపీ అధ్యక్షుడు వాసే మురళీ, మాజీ

పింఛన్ల పంపిణీ పరిశీలన

కూచిపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మొవ్వ మండలంలోని మొవ్వ, నరసంపాలెం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీవో రమాదేవి శుక్రవారం పరిశీలించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ సమస్యలు తలెత్తటంతో కొన్ని చోట్ల పంపిణీ ఆలస్యంగా ప్రారంభమైంది. 8,579 పింఛన్లకు గానూ 8151 (98 శాతం) పింఛన్లు పంపిణీ చేసినట్టు ఎంపీడీవో తెలిపారు.

గోశాలకు పశువుల దాణా వితరణ

గుడివాడ, నవంబరు (ఆంధ్రజ్యోతి) : ధనియాలపేటలోని ప్రణావాశ్రమంలోని గాయత్రి గోశాలకు లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ ప్రగతి పూర్వ అధ్యక్షుడు మనోజ్‌కుమార్ జైన్, కుటుంబ సభ్యులు రూ.10 వేలు విలువ గల పశువుల దాణాను శుక్రవారం అందజేశారు. క్లబ్ అధ్యక్షులు నల్లూరి శేషగిరిరావు, పూర్వాధ్యక్షులు రామదేను వేణుబాబు, వై.రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత మెగా వైద్యశిబిరం రేపు

గుడివాడ, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : కోతిబొమ్మ సెంటర్‌లోని ప్రభావతి గార్డెన్స్‌లో ప్రతి నెలా మొదటి, మూడో ఆదివారాలు రోటరీ క్లబ్ , డాక్టర్ పిన్నమనేని సిద్దార్థ మెడికల్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య నిర్వహిస్తున్నట్లు కన్వీనర్లు డాక్టర్ .సి.సూర్యచంద్రరావు, గుళ్లపల్లి కిరణ్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోకాళ్ల నొప్పులు, ఎముకల సంబంధిత, జనరల్ పరీక్షలు, బీపీ, షుగర్, ఊపిరితిత్తులు, ఆయాసం వంటి సమస్యలకు వైద్యసేవలందిస్తున్నట్టు పేర్కొన్నారు.

నేత్ర దానం

గుడ్లవల్లేరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఆధ్వర్యంలో శుక్రవారం నేత్రదానం నిర్వహించారు. ప్రముఖులు గుమ్మడి రంగారావు సతీమణి గుమ్మడి సుశీల (84) శుక్రవారం మృతి చెందారు. వారి కుమారుడు లయన్స్ క్లబ్ డైరెక్టర్ గుమ్మడి రామకృష్ణ, కుటుంబసభ్యుల అనుమతితో సుశీల రెండు కళ్లను విజయవాడ ఎల్.విప్రసాద్ నేత్రాలయానికి ఇచ్చారు. క్లబ్ కార్యదర్శి పెరుమాళ్ల, మాజీ జిల్లా లయన్స్ గవర్నర్ వైపీసీ ప్రసాద్, మూల్పూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు ఘననివాళి

కూచిపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని మొవ్వ మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జగదీష్ కృష్ణ, జగన్మోహనరావు, పువ్వాడ సురేష్, గణేష్, మోహనరాజా, రమేష్, పలువురు ఆర్యవైశ్య సంఘ నేతలు, సభ్యులు పాల్గొన్నారు.

మొరాయించిన సర్వర్

గుడివాడ రూరల్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): సర్వర్లు మొరాయించటంతో మండలంలో పింఛన్ల పంపిణీకి సచివాలయ సిబ్బంది ఇబ్బందులు పడ్డారు. తెల్లవారుజామునుంచే లబ్ధిదారులందరికీ పింఛన్ల పంపిణీని ప్రారంభించి సర్వర్ పనిచేయలేదు. మధ్యాహ్నం 12.40 గంటలకు సర్వర్లు పని చేయటంతో లబ్ధిదారులకు సచివాలయ కార్యదర్శులు నగదు అందజేశారు.

పెదపారుపూడిలో రెవెన్యూ గ్రామసభ

పెదపారుపూడి, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలో రీ సర్వే భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామసభలను రైతులంతా వినియోగించుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. పెదపారుపూడి గ్రామ సచివాలయం వద్ద రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలపై రైతుల నుంచి 21 దరఖాస్తులు వచ్చాయని ఆయన తెలిపారు. గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా, మిక్కిలినేని సురేంద్ర చౌదరి, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా శివరామ్ జన్మదిన వేడుక

తోట్లవల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్ జన్మదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు యువత కార్యకర్తలు నిర్వహించిన బైక్ ర్యాలీలో శివరామ్ పాల్గొని కేక్ కట్ చేశారు. రొయ్యూరు, వల్లూరుపాలెం, తోట్లవల్లూరు, భద్రిరాజుపాలెం, చాగంటిపాడు, పెనమకూరు, కుమ్మమూరు, గరికపర్రు గ్రామాల్లో శివరామ్ జన్మదిన వేడుకలను పండుగ వాతావరణంలో నిర్వహించారు.

టీచర్ ధనలక్ష్మికి సత్కారం

తోట్లవల్లూరు, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి) : ఐలూరు ప్రాథమికోన్నత పాఠశాల టీచర్ కాగిత ధనలక్ష్మిని ఉద్యోగ విరమణ సందర్భంగా ఘనంగా సత్కరించారు. జడ్పీటీసీ సభ్యులు జొన్నల రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ ఎం కుసుమకుమారి, ఎంఈవో వెంకటేశ్వరరావు, సురేష్, హెచ్‌ఎం రమాదేవి పాల్గొన్నారు.

ప్రతి అడుగూ.. పెన్షనర్ల కోసం



పాదయాత్ర చేస్తున్న లోకాల మురళీకృష్ణ

71 ఏళ్ల వయస్సులో ఆర్టీసీ మాజీ అధికారి పాదయాత్ర

- విజయవాడ నుంచి ఢిల్లీ వరకు అడుగులు
- ఈపీఎస్ పెంపుదలే ప్రధాన డిమాండ్

ఆర్టీసీలో అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారాయన. వయసేమో ఏడు పదులు దాటింది. ఇప్పుడు లక్షలాది మంది ప్రభుత్వ, ప్రైవేటు పెన్షన్‌దారుల కోసం పోరాట అడుగులు వేశారు. వృద్ధాప్యంలోనూ విజయవాడ నుంచి ఢిల్లీ వరకు పాదయాత్ర చేశారు. ఇటీవల పాదయాత్రను పూర్తిచేసుకుని విజయవాడకు వచ్చిన లోకాల మురళీకృష్ణను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది.

-ఆంధ్రజ్యోతి, విజయవాడ సిటీలైఫ్

? పాదయాత్ర ఎందుకు చేయాలనుకున్నారు

నేను ఆర్టీసీ విజయవాడ జోనల్ కార్యాలయంలో స్టోర్స్ ఆఫీసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశా. 1975లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగంలో చేరా. 2011 ఫిబ్రవరిలో ఉద్యోగ విరమణ చేశా. ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన లక్షలాది మంది ఇంకా రూ.1000 పెన్షన్ తీసుకుంటున్నారు. ఆర్టీసీలో ఈడీ హోదాలో పనిచేసిన అధికారి రూ.1000 పెన్షన్ అందుకుంటున్నారంటే ఎవరూ నమ్మరు. ఇది నిజం. ఈపీఎస్‌ను పెంపుదల చేయాలని కొన్నేళ్లుగా పోరాడుతున్నాం. అయినా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదు. ఎలాంటి కాంట్రిబ్యూషన్ లేకుండా ప్రభుత్వం రూ.4వేల పెన్షన్ ఇస్తోంది. ఉద్యోగులుగా మా జీతం నుంచి ఈపీఎస్‌కు డబ్బులు చెల్లించి రూ.1000 పెన్షన్ అందుకోవడం చాలా బాధగా ఉంది. ఇప్పుడున్న ధరలను పరిశీలిస్తే రిటైర్డ్ ఉద్యోగులు ఈ పెన్షన్‌తో జీవించడం చాలా కష్టం.

? ఈ పరిస్థితికి కారణం

ప్రభుత్వ ప్రైవేటు రంగాల్లో పనిచేసే ఉద్యోగుల కోసం ఫ్యామిలీ పెన్షన్ స్కీం 1974 ఉండేది. పీవీ నరసింహరావు ప్రధానిగా ఉన్నప్పుడు 1995 నవంబరులో ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం(ఈపీఎస్)ను ఏర్పాటు చేశారు. అప్పటి వరకు ఫ్యామిలీ పెన్షన్ స్కీంలో ఉన్న నిధులను ఈపీఎస్‌కు బదిలీ చేశారు. 2014 వరకు రూ.200-300 వచ్చేది. అప్పుడు అధికారంలోకి వచ్చిన ఎన్డీఏ ప్రభుత్వం శాస్త్రీయత లేకుండా ఈపీఎస్‌లో కనీస పెన్షన్‌ను రూ.1000గా నిర్ణయించింది. ఇప్పటికీ అదే అమలవుతోంది. ఎన్డీఏ ప్రభుత్వానికి ముందు యూపీఏ ప్రభుత్వం 2013లో భగత్‌సింగ్ కోషియారీ కమిటీని నియమించింది. కమిటీ నివేదిక ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా ఇప్పటి వరకు పార్లమెంటులో పెట్టలేదు. అందుకే పాదయాత్ర చేయాలనుకున్నా.

? నివేదికలో ఉన్న సిఫార్సులేంటి

ఈపీఎస్‌లో కేంద్ర ప్రభుత్వ వాటా 1.16శాతం ఉంది. దీన్ని 8.33 శాతానికి పెంచాలని కోషియారీ కమిటీ స్పష్టం చేసింది. 1995 నుంచి ఈపీఎస్‌తోపాటు డీఏ(కరువు భత్యం) ఇచ్చేవారు. డీఏ 4-4.5శాతంగా ఉండేది. 2000లో డీఏ ఇవ్వడం నిలిపేశారు. కనీస ఈపీఎస్‌గా రూ.1000 ఇస్తున్నారు. 8.33 శాతానికి కేంద్ర ప్రభుత్వ వాటాను పెంచినప్పుడే ఈపీఎస్, డీఏ సక్రమంగా ఇవ్వగలరని భగత్‌సింగ్ కోషియారీ కమిటీ నివేదికలో పేర్కొంది. ఈపీఎస్‌ను కనీసంగా రూ.3000కు పెంచి, డీఏ కలిపి ఇవ్వాలని సూచించింది. ఇలా చేస్తే రూ.1000 ఉన్న కనీస పెన్షన్, డీఏతో కలిపి రూ.9వేలు అవుతుంది. ఈ నివేదిక ఇప్పటికీ పార్లమెంటు మెట్లు ఎక్కలేదు.

? పాదయాత్రలో ఆరోగ్య సమస్యలు రాలేదా

నా వయస్సు 71 ఏళ్లు. విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం నుంచి సెప్టెంబరు పదిన పాదయాత్రకు శ్రీకారం చుట్టాను. నా భార్య ఆర్టీసీలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. కుమారుడికి మానసికస్థితి బాగోలేదు. ఇంట్లో చెప్తే వద్దంటారని నాకు నేనే నిర్ణయం తీసుకున్నా. వాస్తవానికి సెప్టెంబరు తొమ్మిదిన గుంటూరు నుంచి విజయవాడకు పాదయాత్ర చేశాను. తర్వాత ఇక్కడ నుంచి తిరిగి గుంటూరుకు వెళ్లిపోయాను. పదో తేదీ నుంచి అడుగులు వేసుకుంటూ ఢిల్లీకి చేరాను. ఈ యాత్ర మధ్యలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు రాలేదు. సమయానికి ఆహారం తీసుకుంటూ ముందుకు సాగాను.

? రాత్రి సమయాల్లో బస ఎలా

పాదయాత్ర రెండు సమయాల్లో చేశాను. ఉదయం ఎనిమిది గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు కొన్నిరోజులపాటు చేశాను. తర్వాత రాత్రి ఏడు గంటల నుంచి అర్ధరాత్రి వరకు చేశాను. అప్పుడున్న పరిస్థితుల మేరకు నడిచేవాడిని. యాత్ర పూర్తయ్యే వరకు చాలా చోట్ల సొంతం గానే బస ఏర్పాటు చేసుకున్నా. కొన్నిచోట్ల ఆర్టీసీ సిబ్బంది బస ఏర్పాటు చేశారు. నేను ఉమ్మడి రాష్ట్రంలో పనిచేశాను. పాదయాత్ర సాగిన మార్గంలో ఉన్న ఆర్టీసీ డిపోలకు వెళ్లి అధికారులను, సిబ్బందిని, కార్మికులను కలుసుకున్నా. మా సమస్య ఏమిటో ప్రజలకు తెలియాలని ఈపీఎస్‌ను పెంచడంతోపాటు భగత్ సింగ్ కోషియారీ కమిటీ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టాలని తెలుగు, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో ఫ్లెక్సీపై ముద్రించా. దీన్ని ప్రదర్శిస్తూనే పాదయాత్ర చేశా. ఈపీఎస్ సమస్య ఎదుర్కొంటున్న ఉద్యోగులు ఢిల్లీ వెళ్లే వరకు సంఘీభావం తెలిపారు.

? యాత్రలు చేసిన అనుభవముందా

నేను ఎంప్లాయిస్ పెన్షన్ స్కీం వెల్ఫేర్ అసోసియేషన్ దక్షిణాది శాఖ సంయుక్త కార్యదర్శిని. దీనికి ముందు వివిధ హోదాల్లో సంఘంలో పనిచేశా. ఉద్యోగంలో ఉన్నప్పుడు స్కూటర్, సైకిల్ యాత్రలు చేశా. పాదయాత్ర ఎప్పుడూ చేయలేదు. 2018లో గుంటూరు నుంచి ఢిల్లీ వరకు హోండా యాక్టివాపై యాత్ర చేశా. 2018 జనవరిలో గుంటూరు నుంచి నాగపూర్ వరకు సైకిల్ యాత్ర చేశా. 2019, 2020, 2022లో గుంటూరు నుంచి ఢిల్లీ వరకు హోండా యాక్టివాపై యాత్ర చేశా. 2022 మార్చిలో గుంటూరు నుంచి ఢిల్లీ వరకు యాక్టివాపై యాత్ర చేశా. ఈపీఎస్ అమలు చేసినపుడు టైం టు టైం రివిజన్, రివ్యూ చేస్తామని ఈపీఎఫ్ ప్రకటించింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు రివిజన్, రివ్యూ లేదు. దేశంలో పెన్షనర్లు 73లక్షల మంది ఉన్నారు. ఈపీఎస్ రూ.1000 తీసుకుంటున్న వారు 30లక్షలు మంది ఉన్నారు. వాళ్లంతా ప్రైవేటు, ప్రభుత్వ రంగ సంస్థల్లో పనిచేశారు. రాష్ట్రంలో లక్షమంది ఉంటారు.

? ఢిల్లీ చేరుకున్నాక ఏం చేశారు

పాదయాత్రతో ఢిల్లీకి చేరుకున్నాక అక్కడ ఇండియా గేట్ వద్ద ఫ్లెక్సీని ప్రదర్శించి నిరసన తెలియజేశా. వెంటనే అక్కడున్న సెక్యూరిటీ వచ్చి ఫ్లెక్సీ లాక్కున్నారు. ఇక్కడ నిరసనలు తెలియజేయకూడదని చెప్పి పంపేశారు. తర్వాత ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయానికి వెళ్లా. అక్కడి సిబ్బంది లోపలకు అనుమతించలేదు. అక్కడ రిసెప్షన్‌లో వినతిపత్రం తీసుకుని బయటకు పంపేశారు. తర్వాత ప్రధాని, ఆర్థికమంత్రి, కార్మిక మంత్రి కార్యాలయాల్లోనూ ఇలాగే చేశారు. ఈపీఎస్ ప్రవేశపెట్టినప్పటి నుంచి సర్వీసును మాత్రమే పరిగణనలోకి తీసుకున్నారు. అంతకుముందున్న సర్వీసును పరిగణనలోకి తీసుకోలేదు. దీనివల్ల రిటైరైన ఉద్యోగులు ఇబ్బంది పడుతున్నారు.

ఈ నెల నుంచి

బియ్యంతో పాటు జొన్నలు

- తప్పనిసరి కాదు..కార్డుదారులకు ఇష్టమైతేనే
- ఎన్ని కిలోలు తీసుకుంటే అన్ని కేజీల బియ్యం తగ్గింపు
- పౌష్టికాహారం ప్రజలకు అందించాలనే పంపిణీ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): పౌష్టికాహారమైన తృణధాన్యాలను కూడా ప్రజలకు అందించాలని ఈనెల నుంచి తొలిదశలో జొన్నలను పంపిణీ చేయాలని పౌర సరఫరాల అధికారులు నిర్ణయించారు. తృణ ధాన్యాల్లో పౌష్టికాహారం ఎక్కువగా ఉంటుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని రేషన్ బియ్యానికి ప్రత్యామ్నాయంగా తృణధాన్యాలను అందించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచన చేసింది. తృణధాన్యాలు తీసుకోవడం తప్పనిసరి కాదు. కార్డుదారులకు ఇష్టమైతేనే ఇస్తారు. తృణధాన్యాలను తీసుకునే పరిమాణం మేరకు బియ్యం తగ్గిస్తారు. 10 కేజీల బియ్యం వచ్చే కార్డుదారుడు రెండు కేజీల తృణధాన్యాలు తీసుకుంటే అతనికి 8 కేజీల బియ్యం ఇస్తారు. తృణధాన్యాలు తీసుకోవటం కార్డుదారులకు కల్పించిన ఆప్షన్ మాత్రమే. కేజీకి తక్కువ కాకుండా గరిష్ఠంగా మూడు కేజీల వరకు ఇస్తారు.

92.81 శాతం పింఛన్ల పంపిణీ

- ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా 2,15,289 మందికి రూ.90.85 కోట్లు అందజేత

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఎన్టీఆర్ భరోసా పింఛన్లను శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 92.81 శాతం మేర పంపిణీ చేశారు. 2,31,961 మంది పింఛనుదారులుండగా.. వీరిలో 2,15,289 మందికి రూ.90.85 కోట్లను అందజేశారు. జిల్లాలో అత్యధికంగా మైలవరం మండలంలో 9,311 మందికి రూ.39.51 లక్షలను(96.6%) అందజేశారు. 7850 మంది పెన్షనర్లకు రూ.32.67 లక్షల సొమ్మును అందించి విస్సన్నపేట మండలం రెండోస్థానం(95.92%), 4634 మంది పెన్షనర్లకు రూ.19.62 లక్షలను అందించి జగ్గయ్యపేట అర్బన్ మండలం మూడో స్థానం(95.13%)లో నిలిచాయి. తిరువూరు మండలంలో రూ.13.55 లక్షలు(94.32%), జి.కొండూరు మండలంలో రూ.34.19 లక్షలు(94.21%), నందిగామ అర్బన్‌లో రూ.17 లక్షలు (94.03%), ఎ.కొండూరులో రూ.29.06 లక్షలు(93.59%), విజయవాడ అర్బన్ పరిధిలో రూ.2.69 కోట్లు (93.28%), గంపలగూడెంలో రూ.43.56 లక్షలు(92.8%), రెడ్డిగూడెంలో రూ.27.84 లక్షలు(92.45%), వీరులపాడులో రూ.33.75 లక్షలు(92.62%), తిరువూరు మండలంలో రూ.26.42 లక్షలు(92.58%), జగ్గయ్యపేటలో రూ.39.16 లక్షలు(92.36%), నందిగామ మండలంలో రూ.31లక్షలు(92.4%), కంచికచర్ల మండలంలో రూ.39.40 (91.9%), పెనుగంచిప్రోలు మండలంలో రూ.32 లక్షలు(90.78%), కొండపల్లిలో రూ. 20.48 లక్షలు(90.36%), వత్సవాయి మండలంలో రూ.36.29 లక్షలు(90.31%), విజయవాడ రూరల్ మండలంలో రూ.65.96 లక్షలు (90.25%), చందర్లపాడు మండలంలో రూ.37.25 లక్షలు(90.17%) మేర పంపిణీ చేశారు.

విజయవాడ - విశాఖపట్నం మధ్య

16 జనసాధారణ్ రైళ్లు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ప్రయాణీకుల రద్దీ కారణంగా సామాన్య ప్రయాణికులను దృష్టిలో ఉంచుకుని విజయవాడ, విశాఖపట్నం మధ్య 16 జనసాధారణ్ రైళ్లను నడుపుతున్నట్టు శుక్రవారం రైల్వే అధికారులు ప్రకటించారు. ఇవి పూర్తిగా అన్ రిజర్వ్‌డ్ కేటగిరీకి చెందినవి. నవంబరు 3, 4, 6, 8, 10, 11, 13 తేదీల్లో ఈ రైళ్లను నడుపుతున్నారు. ఈ రైళ్లకు విశాఖపట్నం- విజయవాడ మధ్య దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, గన్నవరంలో హాల్టింగ్ ఉంటుంది.

అన్ని వర్గాలను సంతృప్తిపరిచేలా పాలించండి

- సీఎం చంద్రబాబుకు వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచన

దర్నాచౌక్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రజలు, సన్న, చిన్నకారు రైతులు, కౌలురైతులు, వ్యవసాయ కార్మికులు, చిరు వ్యాపారులు, మహిళలకు సంతృప్తి కలిగేలా పాలన చేయాలని సీఎం చంద్రబాబుకు మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు సూచించారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించాక, గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆయన ప్రెస్‌మీట్‌లో మాటాడారు. 'రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలను స్వాగతిస్తున్నా. ప్రత్యేక హోదాతోనే పరిశ్రమల ఏర్పాటుకు రాయితీలివ్వడం సాధ్యమవుతుంది. 'హోదా' లేకుంటే ప్రభుత్వంపై తీవ్రభారం పడుతుంది. ప్రధాని మోదీపై ఒత్తిడి తెచ్చి హోదా సాధించాలి. అదానీ కంపెనీకి విశాఖపట్నంలో 5వేల నుంచి 20 వేల ఎకరాల భూమిని ఇవ్వాలనే ప్రతిపాదనలను విరమించుకోవాలి. రాబోయే ఇరవై ఏళ్ల తర్వాత ఉపయోగపడే అమరావతి ఔటర్ రింగ్‌రోడ్డు అవసరం ప్రస్తుతం లేదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ప్రకాశం, అనంతపురం జిల్లాల్లో ఇనుప గనులను కేటాయించాలి. చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, అమరావతిలను కలుపుతూ బుల్లెట్‌ట్రైన్ ఆలోచన విరమించుకోవాలి. దీనికి లక్షల కోట్లు ఖర్చవుతుంది. అమరావతిలో భూములిచ్చిన రైతుల్లో ఇప్పటికీ కొందరికి ప్లాట్లు కేటాయించలేదు. ఇప్పటికే అమరావతిలో ఉన్న భవనాలను వినియోగించుకోవాలి. ఐకానిక్ హైకోర్టు, ఐకానిక్ అసెంబ్లీ అవసరం లేదు. ఇసుక, మద్యం పాలసీల్లో టీడీపీ తీరు సరికాదు.' అని వడ్డే పేర్కొన్నారు.


గాజుల అలంకారానికి ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో కేఎస్ రామారావు

దుర్గగుడిలో నేటి నుంచి

కార్తీక వేడుకలు

వచ్చే నెల 1వరకు నిర్వహణ

వన్‌టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఈనెల 2వ తేదీ నుంచి డిసెంబరు 1వ తేదీ వరకు కార్తీకమాస వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఈవో కె.ఎస్.రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. 'రోజూ మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు సహస్ర లింగార్చనలు, ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు చతుర్వేద పారాయణం, కారక పారాయణలు, శివపంచాక్షరి, లక్ష్మీ గణపతి జపములు, మహనివేదనలు నిర్వహిస్తాం. ఈనెల 3న అమ్మవారికి గాజుల అలంకారం, 5న నాగులచవితి సందర్భంగా శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉపాలయంలో ఉదయం 4 గంటలకు పంచామృతాలతో అభిషేకం నిర్వహిస్తాం. రోజూ ఉదయం సహస్ర లింగార్చన, రుద్ర హోమాలు, ఊంజల్ సేవలతో పాటు సాయంత్రం 6.30 గంటలకు అష్టోత్తర పూజా వేదిక వద్ద ఆర్జిత సేవగా దీపోత్సవం జరిపిస్తాం. కార్తీక పౌర్ణమి సందర్భంగా 15న మహామండపం ఏడో అంతస్థులో కోటి దీపోత్సవం, రాత్రి 7 గంటలకు జ్వాలా తోరణం ఉంటుంది. 15న ఉదయం 5.55 గంటలకు గిరి ప్రదక్షిణ యథావిధిగా జరుగుతుంది. రాత్రి 7 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో కృత్తిక దీపోత్సవ వేడుక నిర్వహిస్తాం. ఈనెల 4, 11, 12, 15, 18, 25, 26, 29 తేదీల్లో బిల్వార్చనలు, రోజూ మల్లేశ్వరస్వామికి మహనివేదన జరుగుతుంది.' అని ఈవో పేర్కొన్నారు. కార్తీక మాసంలో సహస్ర లింగార్చన, ఊంజల్ సేవల్లో పాల్గొనేందుకు రోజుకు టికెట్టు రుసుము రూ.500, రుద్ర హోమంలో పాల్గొనేందుకు రూ.1000, సహస్ర లింగార్చన సేవలో నెలరోజుల పాటు పాల్గొనేందుకు రూ.5,116, ప్రత్యేక బిల్వార్చన సేవలో పాల్గొనేందుకు రూ.2000, ఊంజల్ సేవ (దీపారాధన)కు రూ.50 రుసుము చెల్లించాలని ఈవో సూచించారు.

రేపు దుర్గమ్మకు గాజుల అలంకారం

దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆదివారం అమ్మవారికి గాజుల అలంకారం వేడుక నిర్వహిస్తామని ఈవో కె.ఎస్.రామారావు తెలిపారు. అమ్మవారిని, దేవాలయ పరిసర ప్రాంగణాన్ని గాజులతో అలంకరిస్తామని ఆయన తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి ఉచిత దర్శనంలోను, 5 గంటలకు అన్ని దర్శనాల్లోనూ అమ్మవారు గాజుల అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారని ఆయన తెలిపారు. గాజుల అలంకరణ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో ఆలయ అధికారులు, సిబ్బందికి సూచనలు చేశారు. పెద్ద సంఖ్యలో గాజులు విరాళంగా అందించాలని భక్తులకు ఈవో సూచించారు.

ఆకాశదీపం వెలిగించి..వేడుకలకు శ్రీకారం

కార్తీకమాసం ప్రారంభం సందర్భంగా దుర్గామల్లేశ్వర దేవస్థానంలో శుక్రవారం రాత్రి దేవస్థానం ఈవో కె.ఎస్.రామారావు ఆకాశదీపాలు వెలిగించారు. ఈవో దంపతులు కనకదుర్గమ్మ దేవస్థానం, మల్లేశ్వరస్వామి ఆలయంలోని ధ్వజస్తంభాల వద్ద శాస్త్రోక్తంగా పూజలు చేసి, ఆకాశదీపాలు వెలిగించి కార్తీక మాస వేడుకలకు శ్రీకారం చుట్టారు.


ధ్వజస్తంభం వద్ద ఆకాశదీపాలు వెలిగిస్తున్న ఈవో దంపతులు

శాస్త్రోక్తంగా ధనలక్ష్మీపూజ

దీపావళి పండుగ సందర్భంగా దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రధాన ఆలయంలో అమ్మవారి ఆలయ వైదిక సిబ్బంది గురువారం శాస్త్రోక్తంగా ధనలక్ష్మీపూజ నిర్వహించారు. ఈవో కె.ఎస్.రామారావు దంపతులు పూజలు చేశారు. దుర్గగుడిలో దీపాలు వెలిగించారు.

దీపావళి వేడుకలు

దేవస్థానంలో ప్రదోషకాలంలో అమ్మవారికి పంచహారతుల సేవ నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఈవో రామారావు దీపాల ప్రజ్వలన చేసి బాణాసంచాలు వెలిగించారు. ఆలయ అధికారులు, సిబ్బంది టపాసులు కాల్చి దీపావళి వేడుకలు నిర్వహించారు.

సీఎం చంద్రబాబు

ఫ్లెక్సీ దహనం

- వైసీపీ సానుభూతిపరుడు, న్యాయవాది అరెస్టు

అవనిగడ్డ, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్ర బాబు, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఫొటోలతో కూడిన ఫ్లెక్సీని వైసీపీ సానుభూతిపరుడిగా చెప్పుకొంటున్న అవనిగడ్డకు చెందిన యువకుడు, న్యాయవాది బడే గౌతమ్ తగలబెటాడు. నాగాయ లంక మండలంలో గురువారం రాత్రి జరిగిన ఈ ఘటనను వీడియో తీసి సామాజిక మాధ్యమాల్లో అప్‌లోడ్ చేశాడు. దీనిపై టీడీపీ, బీజేపీ, జనసేన నేతలు స్పందించారు. గౌతమ్‌ను వెంటనే అరెస్టు చేయాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్, సీఐ యువకుమార్, ఎస్ఐ శ్రీనివాస్‌లకు ఫిర్యాదు చేశారు. ప్రజాస్వామ్యవాదాన్ని, గాంధేయ వాదాన్ని నమ్మి రాజకీయం చేసే తమ నేతల ఫొటోలను ఉద్దేశపూర్వకంగా తగలబెట్టి మాజీ సీఎం జగన్ వద్ద గుర్తింపు పొందాలనే గంజాయి బ్యాచ్‌ను గౌతమ్ వెంట వేసుకుని ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడని పేర్కొన్నారు. విచారణ నిర్వహించిన పోలీసులు శుక్రవారం సాయంత్రం నాగాయ లంక నుంచి అవనిగడ్డకు వస్తున్న గౌతమ్‌ను అరెస్టు చేశారు.


చంద్రబాబు, బుద్ధప్రసాద్ ఫ్లెక్సీని తగలబెడుతున్న వైసీపీ సానుభూతిపరుడు, న్యాయవాది గౌతమ్

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో

4 నుంచి షార్ట్‌టర్మ్ కోర్సులు

భారతీనగర్, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీ యాడ్స్ అండ్ సిగ్న్స్, రివెల్యూషనరీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డెస్క్‌టాప్ పబ్లిషింగ్(డీటీపీ), సిగ్నేజ్‌సొల్యూషన్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్ షార్ట్‌టర్మ్ కోర్సులకు ఈనెల 4 నుంచి శిక్షణ తరగతులు ప్రారంభమవుతాయని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.వి క్టర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. డీటీపీ, సిగ్నేజ్‌సొల్యూషన్ కోర్సుల్లో అభ్యర్థులకు డిజైన్, విజువల్ కమ్యూనికేషన్ సామర్థ్యాలను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఎలక్ట్రికల్ టెక్నీషియన్ అభ్యర్థులకు వాణిజ్య, నివాస భవనాలు, పెద్దపరిశ్రమల్లో విద్యుత్ వ్యవస్థలను నిర్వహించడానికి అవసరమైన కీలక నైపుణ్యాలను బోధిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 93477 79032, 80087 42842లో సంప్రదించాలని ఆయన సూచించారు.


సర్దార్ వల్లభాయిపటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

ఉక్కుమనిషి పటేల్

- కలెక్టరేట్‌లో ఘనంగా ఏక్తాదివస్..

నివాళులర్పించిన ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా

కృష్ణలంక, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): 'దేశ సమగ్రతను కాపాడిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయి పటేల్. దేశ ఐక్యత కోసం ఆయన విశేష కృషి చేశారు. ఆయన సంకల్పాన్ని నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలి.' అని ఇన్‌చార్జి కలెక్టర్ నిధి మీనా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో సర్దార్ వల్లభాయి పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏక్తాదివస్‌ను గురువారం ఘనంగా నిర్వహించారు. పటేల్ చిత్రపటానికి నివాళులర్పించారు. సర్దార్ వల్లభాయి పటేల్ ఆశయ సాధనకు కృషి చేస్తామని, సమగ్రతకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేయించారు. డీఆర్వో వి.శ్రీనివాసరావు, కలెక్టరేట్ ఏవో శ్రీనివాసరెడ్డి, కార్యాలయ వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా

పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించండి

- నారెడ్కో ప్రతినిధులను కోరిన కూటమి అభ్యర్థి ఆలపాటి

వన్‌టౌన్, నవంబరు 1(ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీగా కూటమి అభ్యర్థిగా పోటీ చేస్తున్న తనను భారీ మెజారిటీతో గెలిపించాలని జాతీయ స్థిరాస్తి అభివృద్ధి మండలి(నారెడ్కో) ప్రతినిధులను ఆలపాటి రాజేంద్రప్రసాద్(రాజా) కోరారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన నారెడ్కో సర్వసభ్య సమావేశానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కూటమి అభ్యర్థిగా తనను ఎంపిక చేసిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. 'గత వైసీపీ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యమయ్యాయి. జగన్ అరాచకాల వల్ల అన్ని వర్గాలు తీవ్ర అవస్థల పాలయ్యాయి. ఏ రంగమూ అభివృద్ధి చెందలేదు. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారు. రాష్ట్రంలో స్థిరాస్తి వృద్ధే అందుకు నిదర్శనం. చంద్రబాబు రియల్ ఎస్టేట్ రంగంలో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు.' అని ఆలపాటి పేర్కొన్నారు. తమ సమస్యలను ఆలపాటికి నారెడ్కో సభ్యులు వివరించి, పరిష్కరించాలని కోరారు. నిర్వాహకులు రాజేంద్రప్రసాద్‌కు మెమొంటో అందించి, సత్కరించారు. నారెడ్కో ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షుడు పరుచూరి కిరణ్, కోశాధికారి చావా రమేష్, సెంట్రల్ జోన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీ రమణ, కోశాధికారి శ్రీకృష్ణ పాల్గొన్నారు.

ఆలపాటిని భారీ మెజారిటీతో గెలిపించాలి

- ఏపీ సైనిక సంఘం మాజీ అధ్యక్షుడు మోటూరి శంకరరావు

విద్యాధరపురం, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కూటమి ప్రభుత్వం బలపరచిన ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ సైనిక సంఘం మాజీ అధ్యక్షుడు మోటూరి శంకరరావు కోరారు. ఆటోనగర్‌లోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 సంవత్సరాల సర్వీసు చేసిన ప్రతి మాజీ సైనికుడు కూడా శాసన మండలి ఎన్నికల్లో ఓటు వేయటానికి అర్హుడని, ప్రతి ఒక్క మాజీ సైనికుడు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే మాజీ సైనికులకు కార్పొరేషన్ ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. సమావేశంలో మాజీ సైనిక సంఘం ప్రతినిధులు వై.రమేష్ కుమార్, ఎం.గోపాలకృష్ణ, ఐ.రత్న ప్రసాద్, పి.రాంబాబు, తిరుపతిరావు, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

11 నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ

గవర్నర్‌పేట, నవంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఎంజీ రోడ్డులోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం(ఎంబీవీకే)లో ఈనెల 11వ తేదీ నుంచి బ్యూటీషియన్ కోర్సులో శిక్షణ ప్రారంభమవుతుందని ఎంబీవీకే మహిళా శిక్షణ విభాగం కన్వీనర్ పి.విజయ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు శిక్షణ ఉంటుందని ఆమె పేర్కొన్నారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి ఉన్నవారు ఈనెల 10వ తేదీలోపు ఎంబీవీకేలోని కార్యాలయాన్ని సంప్రదించాలని ఆమె సూచించారు. మరిన్ని వివరాలకు 94900 98021కు ఫోన్ చేసి సంప్రదించాలని విజయ పేర్కొన్నారు.